

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 57 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 7.17 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 2.12 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 12.55-2.41; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.41; అమృతఘడియలు: రా. 11.32-1.19; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | విశాఖపట్నం సిటీ

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









SCHOLARSHIP ALERT

FAEA Scholarship

Description: FAEA Scholarship 2024-25 is an opportunity offered by the Foundation for Academic Excellence and Access (FAEA) to Class 12 passed or first-year undergraduate students pursuing degrees in Arts, Commerce, Science, Engineering, or other technical and professional fields at any Indian institution.

Eligibility: Open for Class 12 students or first -year undergraduate students enrolled in a program offered by a recognized university, institution, or college in India, in fields including Arts, Commerce, Science, Medical, Engineering, or other technical or professional disciplines. Applicants must belong to a so cially and economically disadvantaged community, categorised as SC, ST, OBC, or BPL.

Prizes & Rewards: Tuition fees, maintenance allowance or hostel/mess charges and other allowances

Last Date to Apply: 30-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/FAEA2

NextGen Edu Scholarship



Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/EYGDS1

Eternal University's Scholarship Aspiring Young Women 2024-27

Description: Eternal University in collaboration with NavGurkul and Sri Badrika Ashram, invi tes applications for its BCA program from Class 12 passed female students domiciled in Himachal Pradesh, Punjab, and neighbouring states.

Eligibility: Open for female Indian nationals between the ages of 16 and 28 years. Applicants must be domiciled in Punjab, Himachal Pradesh, or neighbouring areas, and have passed Class 12 from a recognised institution. Students must be willing to pursue a BCA program at the university and have an annual family income of not more than 6 lakhs.

Prizes & Rewards: A waiver of 3.25 lakhs towards tuition fees, accommodation, food, and a laptop for the course duration.

Last Date to Apply: 30-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/BCAY1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

కోర్ బ్రాంచెస్‌లో కీలకం మెకానికల్ ఇంజనీరింగ్

యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.



కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. మానవుడి రోజువారి జీవితంతో ఈ సబ్జెక్టుకు విడదీయరాని అనుబంధం ఉంది. నివశిస్తున్న భవనంతో మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు చాలా వాటిని మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్, మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. గతాన్ని ఆధారం చేసుకుని మరింత మెరుగైన యంత్రాలను కూడా సూచిస్తారు. టెక్నాలజీతో వచ్చిన అడ్వాన్స్‌మెంట్ ఫలితంగా వివిధ ప్రక్రియల మెరుగుదలకు తోడు సమస్యలకు మంచి పరిష్కారం చూపగలుగుతారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు. మెడికల్ డివైజ్‌లు, ఎలివేటర్లు, ఇంజన్లు తదితరాలన్నింటిలో మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్ పనులు సక్రమంగా నిర్వహించగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

కౌన్సెలింగ్ గైడెన్స్

పలు కంపెనీలు వీరికి జాబ్స్ ఇస్తున్నాయి. గోద్రేజ్, మహీంద్రా అండ్ మహీంద్రా, లారెన్స్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి), కిర్లోస్కర్, థెర్మాక్స్, అశోక్ లేలాండ్, బీహెచ్‌ఈఎల్, ఇస్రో, కోల్ వంటి టాప్ పర్ఫార్మింగ్ కంపెనీలు వీరికి ఇచ్చే జాబ్స్ చాలా ఉపయోగకరంగా, వృత్తిలో ఎదిగేందుకు వీలు కల్పించే విధంగా ఉంటాయి. నిజానికి అకడమిక్ గ్యాప్‌ని పూరించేందుకు బీటెక్ కోర్సు తోడ్పడుతుంది. నైపుణ్యం, జాబ్‌లో ఇంప్రూవ్‌మెంట్‌కు అవసరపడుతుంది. అందుకే చదువుతున్నప్పుడే ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ చాలా అవసరం. లోతైన అవగాహన కోసం పీజీ చేస్తే ఇంకా మంచిది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో లెక్కలేనన్ని అవకాశాలు ఎదురు చూస్తూ ఉంటాయి. సంబంధిత అవగాహన, నైపుణ్యాలను అనుసరించి విలక్షణమైన జాబ్స్‌ను పొందవచ్చు.

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో మరొక భవన నిర్మాణంలోనూ మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండే వారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరమవుతాయి.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరమవుతాయి. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్ డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది. ఇందులోనూ ఎక్స్‌పీరియెన్స్‌డ్ మెకానికల్ ఇంజనీర్లు నేతృత్వం వహిస్తారు.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరాని వాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది. వివిధ ఉత్పత్తులకు అవసరమైన యంత్రాల నిర్మాణం, మెరుగుదలలోనూ పాత్ర ఉంటుంది. మొత్తమ్మీద యంత్ర పురోగతితో మానవాభివృద్ధి ముడిపడి ఉందన్న అవగాహన ఉంటే సమాజంలో మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంత అన్నది అర్థమవుతుంది. అవకాశాలకు ఆకాశమే హద్దు అన్న విషయమూ అవగతమవుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటీ రాయపూర్

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0hymA9Rలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాయన్ రాక ఖాయం



హీరో ఇమేజ్‌ను పక్కనపెట్టి ఎలాంటి పాత్రలో అయినా ఇట్టే ఇమిడిపోయే నటనా చాతుర్యం ధనుష్ సొంతం. తమిళ చిత్రాలతో మొదలైన ఆయన నట ప్రస్థానం హాలీవుడ్ దాకా చేరింది. కోట్లాది మంది అభిమానుల ఆదరణ సొంతం చేసుకుంది. 'ఇంత సాధించాం ఇక చాల్లే' అనుకోకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆయన త్వరలో తన 50వ చిత్రం 'రాయన్'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమాను ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తోంది. మేకర్స్ మంగళవారం రిలీజ్‌డేట్‌ను ప్రకటించారు. జూలై 26న 'రాయన్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. కాళిదాస్ జయరామ్, ఎస్.జె సూర్య, సెల్వ రాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ప్రధాన తారాగణం. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్. ఎడిటర్: ప్రసన్న జికె

రవితేజ 75వ సినిమా!



స్వయంకృషితో స్టార్ ఎదిగిన నటుడు రవితేజ. కామెడీ టైమింగ్‌లో, విలక్షణమైన డైలాగ్ డెలివరీతో ఆడియన్స్‌ను ఆకట్టుకొన్న ఆయన కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ఇది ఆయనకు 75వ సినిమా కావడం విశేషం. సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న శ్రీలీల క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించడం విశేషం. ఈ చిత్రంతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రానికి మాటల రచయితగా, 'సామజవరగమన' సినిమాకు స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు పొందిన భాను భోగవరపు ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 109వ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ఆ చిత్రం నిర్మాణంలో ఉండగానే ఆయనకు దర్శకుడిగా అవకాశం రావడం గమనార్హం. పలు విజయవంతమైన చిత్రాలను నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోదంతో కూడిన పూర్తి మాస్ పాత్రలో రవితేజను చూడాలని కోరుకుంటున్న ఆయన అభిమానులకు ఈ సినిమా ఫుల్ జోష్ ఇస్తుందని దర్శకనిర్మాతలు వెల్లడించారు. మంగళవారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్.

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె వివాహం



సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. అర్జున్ నిర్మించిన యోగాంజనేయస్వామి దేవాలయంలోనే ఈ పెళ్లి సంప్రదాయబద్ధంగా జరిగింది. తమిళ హాస్యనటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి పెళ్లి కొడుకు. కొన్ని తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. ఈ పెళ్లికి విశాల్, కార్తి, సముద్రఖని, కె.ఎస్.రవికుమార్, ఎస్.ఆర్.ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

యేవమ్ అందరికీ మంచి బ్రేక్ ఇస్తుంది



చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి నవదీప్, గోపరాజు నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "నేను బాగా గౌరవం ఇచ్చే కోస్టార్స్‌లో చాందిని ఒకరు. పలువురు మహిళలు ఉన్న ఈ సినిమా టీమ్‌ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ చిత్రం మంచి బ్రేక్‌నిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ "ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు ఊహించని విధంగా ఉంటాయి" అని చెప్పారు. "మనసుపెట్టి, నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా" అని నిర్మాత నవదీప్ అన్నారు. చిత్ర దర్శకుడు ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ "ఆసక్తికరంగా ఉండే వినోదాత్మక థ్రిల్లర్ 'యేవమ్'" అని చెప్పారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ "ఇందులో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటుందని అనుకున్నాను. అయితే యాక్షన్‌తో పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి" అని చెప్పారు.

రౌడీ రిలీజ్‌కు రెడీ



కేజీఎఫ్ ఫేమ్ యశ్ హీరోగా నటించిన ఓ కన్నడ చిత్రం 'రాజధాని రౌడీ' పేరుతో తెలుగులో విడుదలవుతోంది. షీనా కథానాయిక. కేవీ రాజు దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. సంతోష్ ఎంటర్టైన్‌మెంట్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడిన నలుగురు యువకులు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు అనే పాయింట్ చుట్టూ కథ సాగుతుంది. వినోదానికి చక్కటి సందేశాన్ని జోడించి తెరకెక్కించాం' అని తెలిపారు. 'ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా కీలకపాత్రలో నటించారు. ముమైత్‌ఖాన్ పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది' అని దర్శకుడు అన్నారు.

సీతాకోక చిలుకై ఎగిరింది



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను కీర్తన'. రిషిత, మేఘన కథానాయికలు. సీ లక్ష్మీకుమారి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'సీతాకోక చిలుకై ఎగిరింది మనసే' అంటూ సాగే యుగళ గీతాన్ని నిర్మాత సాయి రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 'ఫస్ట్‌కాపీ సిద్ధమైంది. పాటలు, ఫైట్స్ మా చిత్రానికి ప్రత్యేకాకర్షణ. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు.


'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mv5nFAq లో చదవండి.

క్లైమాక్స్ గుర్తుండిపోతుంది



'సెహరి' సినిమాతో దర్శకుడిగా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల దగ్గర మంచి మార్కులు కొట్టేశారు జ్ఞానసాగర్ ద్వారక. ఆయన దర్శకత్వం వహించిన రెండో సినిమా 'హరోం హర'. సుధీర్‌బాబు నటించిన ఈ చిత్రాన్ని సుమంత్.జి.నాయుడు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ సినిమాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. 'హరోంహర' ఒక న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. 1990ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ చిత్రంలో చాలా మాస్ ఎలిమెంట్స్, ఎలివేషన్స్ ఉంటాయి. వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. ఇందులో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసే కథానాయకుడు.. గన్ మేకింగ్ మొదలుపెట్టి పవర్‌ఫుల్ సుబ్రమణ్యంగా ఎలా మారాడన్నది సినిమా కథ. లవ్, యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్‌తో పాటు ఆధ్యాత్మిక అంశాలు కూడా ఉంటాయి. సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది. కుప్పం యాసలో ఆయన ఇరగదీశారు. సినిమాకు మ్యూజిక్, విజువల్స్ బాగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో చూస్తున్న ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. క్లైమాక్స్ అయితే ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని చెప్పారు.

కన్నడ హీరో దర్శన్ అరెస్టు



ప్రియురాలి కోసం ఓ వ్యక్తిని హత్య చేయించారన్న ఆరోపణలతో ప్రముఖ కన్నడ హీరో దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నటి పవిత్ర గౌడతో దర్శన్ సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో పవిత్రకు అసభ్యకర సందేశాలు పంపిన రేణుకాస్వామి (33) దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కన్నడ ఇండస్ట్రీని కుదిపేసింది. దర్శన్ సూచనల మేరకే ఈ హత్య జరిగినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మైసూర్‌లో దర్శన్‌ను, ఆయన ప్రియురాలు పవిత్ర గౌడను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు రేణుకాస్వామి హత్య కేసులో సంబంధం ఉన్న మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్టు మంగళవారం ప్రకటించారు. రేణుకాస్వామి ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడు. ఆయన ఇటీవల పవిత్రగౌడపై సోషల్ మీడియాలో అసభ్య సందేశాలు పోస్టు చేశారని ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని ఆమె నటుడు దర్శన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చిత్రదుర్గలోని దర్శన్ అభిమాన సంఘం ముఖ్యుడు రాఘవేంద్రకు సమాచారం ఇచ్చి, రేణుకాస్వామిని బెంగళూరుకు రప్పించారు. కామాక్షిపాళ్యలోని దర్శన్ అనుచరుడికి చెందిన కారుషెడ్‌లో ఈ నెల 8న రేణుకాస్వామిపై దాడి చేసి చంపేశారు. పోలీసులు దర్యాప్తులో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ హత్యతో సంబంధం ఉన్న దర్శన్, పవిత్రలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పవిత్రగౌడ ఏ1 కాగా, దర్శన్ ఏ2గా ఉన్నారు. వారిని మంగళవారం సాయంత్రం 24వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరిచారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం 12-6-2024
Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
అనకాపల్లి

ప్రమాణ స్వీకారోత్సవం వీక్షణకు ఏర్పాట్లు

నేడు సీఎంగా చంద్రబాబు బాధ్యతలు

ఎల్ఈడీ స్క్రీన్లు సిద్ధం చేసిన అధికారులు

చోడవరం, జూన్ 11: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బుధవారం నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించేందుకు అధికారులు ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


విద్యుత్ దీపాలతో సుందరంగా చోడవరం ఎంపీడీవో కార్యాలయం

అమాత్యులెవరో?

అనకాపల్లి జిల్లా నుంచి రేస్‌లో అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత

- జనసేన కోటాలో కొణతాలకు ఛాన్స్?
- విశాఖ జిల్లా నుంచి గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు


చింతకాయల అయ్యన్నపాత్రుడు


వంగలపూడి అనిత


కొణతాల రామకృష్ణ


గంటా శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరుతోంది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరిస్తున్నారు. కూటమిలోని పార్టీలు అన్నింటికీ మంత్రివర్గంలో స్థానం కల్పిస్తున్నారు. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలకు కూడా అవకాశం దక్కనుంది. మంత్రి పదవులు ఎవరికి లభిస్తాయనే దానిపై రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. కూటమి పెద్దలు మాత్రం మంగళవారం రాత్రి వరకు ఎవరికీ ఎటువంటి సంకేతాలు ఇవ్వలేదు. సామాజిక వర్గాలు, సీనియారిటీ, పార్టీ పట్ల నిబద్ధత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు.


పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం జిల్లా వరకు తీసుకుంటే ఇద్దరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు గంటా శ్రీనివాసరావు. ఆయన భీమిలి నుంచి 92 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. మరొకరు ఎన్నికల వరకు విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేసి గాజువాక నుంచి 95 వేల మెజారిటీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావు. గంటా శ్రీనివాసరావు గతంలో రెండుసార్లు మంత్రి పదవులు నిర్వహించారు. పోర్టులు, మౌలిక వసతుల శాఖ, మానవ వనరుల (విద్యా) శాఖ నిర్వహించారు. ఇక యాదవ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి వస్తుందని బాగా ప్రచారం జరుగుతోంది. పార్టీ విధేయుడిగా ఉండడం, వైసీపీ ప్రలోభాలకు లొంగకపోవడం, రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం... ఆయనకు అనుకూల అంశాలుగా చెబుతున్నారు. అయితే జిల్లాలో ఒకరికే మంత్రి పదవి ఇస్తారని, గంటా లేదంటే పల్లా ఇద్దరిలో ఒకరికే ఛాన్స్ దక్కుతుందని అంటున్నారు.

అనకాపల్లి జిల్లాను తీసుకుంటే అక్కడ ముగ్గురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడు, నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనిత. వీరిద్దరిలో

... మిగతా 2వ పేజీలో

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకుల పంట

విశాఖ విద్యార్థులకు అగ్రికల్చర్/ఫార్మసీలో రాష్ట్రస్థాయిలో 8, 9 ర్యాంకులు

- ఇంజనీరింగ్‌లో 11, 13, 20, 31, 34, 39, 43, 52, 55, 60, ఎం.రిషీ వర్ధన్ 63, 70, 81, 82, 89, 93, 97 ర్యాంకులు
- అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో 100లోపు పాతిక మందికి ర్యాంకులు


చోడిశెట్టి ధనుంజయ్ 193 (ఇంజనీరింగ్)


కసిరెడ్డి సాయిచంద్ర కిరణ్‌నాయుడు 265 (ఇంజనీరింగ్)


దుర్గా లక్ష్మీనిఖిలేశ్వర్ 453 (ఇంజనీరింగ్)

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. అగ్రికల్చర్/ఫార్మసీ స్ట్రీమ్‌లో నగర పరిధిలోని వడ్లపూడికి చెందిన శంబంగి మనో అభిరామ్ ఎనిమిది, గాజువాక బీసీ రోడ్డుకు చెందిన శరగడం పావనికి తొమ్మిదో ర్యాంకు సాధించారు.

ఇంజనీరింగ్‌కు సంబంధించి మణికంఠ పృథ్వీరాజ్ 11వ ర్యాంకు, ఎం.బాలాదిత్య 13, సీహెచ్ చక్రధర్ 20, ఎం.సాయిశివలోచన్ 31, రెడ్డి అనిల్ 34, ఎస్.జ్యోతిరాదిత్య 39, తోట ధీరజేశ్వర్ 43, ఎం.హర్షవర్ధన్ 52, డి.వర్ధన్ 55, రాజేష్ 60, ఎం.రిషీ వర్ధన్ 63, బి.తన్మయ 70, చింతు సతీష్‌కుమార్ 81, ఎ.హేమంత్ 82, జి.పవన్‌కుమార్ 89, పీఎస్ నారాయణ 93, కె.కుశాల్ 97వ ర్యాంకు సాధించారు. ఇక అగ్రికల్చర్/ఫార్మసీలో కేఎస్ఎస్ పవన్‌కుమార్ 32, జె.మారుతి 48

... మిగతా 2వ పేజీలో

విస్తరణ ఒట్టిమాటే!



- ఏడాది గడిచినా కార్యరూపం దాల్చని వైనం
- ఆర్భాటంగా ప్రకటించిన జీవీఎంసీ యంత్రాంగం
- పైసా విదల్చలేదంటున్న స్థానికులు

అనకాపల్లి టౌన్, జూన్ 11:

జిల్లా కేంద్రం అనకాపల్లిలోని ఎన్టీఆర్ జంక్షన్ విస్తరణపై జీవీఎంసీ యంత్రాంగం, టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రకటనలు బూటకమేనని తేలిపోయింది. గత ఏడాది ఆగస్టులో ఈ జంక్షన్‌ను 80 అడుగుల మేర విస్తరిస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించినా ఇప్పటి వరకు ఆ దిశగా కనీస చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రధాన కూడలిలో అవస్థల మధ్య పట్టణవాసులు రాకపోకలు సాగిస్తున్నారు.

అనకాపల్లిలో ఎన్టీఆర్ జంక్షన్ కీలకమైనది. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి ఈ మార్గంలోనే చేరుకోవాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న కూడలిని ప్రస్తుతం ఉన్న 40 అడుగుల వెడల్పు నుంచి 80 అడుగులకు విస్తరిస్తామని గత ఏడాది ఆగస్టులో జీవీఎంసీ అధికారులు, స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రకటించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, కొద్దిరోజుల్లో పనులు ప్రారంభిస్తామని కూడా హామీ ఇచ్చారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని పట్టణవాసులు భావించారు. అయితే ఏడాది సమీపిస్తున్నా ఇప్పటివరకు జంక్షన్ విస్తరణపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ రహదారికి ఎడమ పక్కన యల్లయ్య కాలువ ఉండడంతో విస్తరణలో భాగంగా ఆ కాలువపై కాంక్రీట్ శ్లాబు నిర్మిస్తామన్నారు. జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న రహదారిలో, ఎన్టీఆర్ స్టేడియానికి ఆనుకుని ఉన్న బడ్డీలను తొలగించి, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపిస్తామని కూడా చెప్పిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం నాలుగు చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా దానిని తొమ్మిది అడుగులకు పెంచి, రౌండ్ సర్కిల్ ఏర్పాటు

... మిగతా 2వ పేజీలో

త్వరలో ప్రారంభిస్తాం

ఎన్టీఆర్ జంక్షన్ విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే యల్లయ్య కాలువకు ఆనుకుని ఓ భవనం ఉంది. దానివల్ల సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. అయితే అన్ని సమస్యలను పరిష్కరించి, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

-వేణుగోపాలరావు, డీఈ, జీవీఎంసీ జోనల్ కార్యాలయం

అరకొరగా పాఠ్యపుస్తకాలు


ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ, తదితరులు

- పాఠశాలలు రేపు పునఃప్రారంభం
- ఆందోళనలో విద్యార్థులు

రొలుగుంట, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఉచితంగా అందించాల్సిన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో వారిలో ఆందోళన రేగుతోంది. రొలుగుంట మండలానికి అరకొరగా పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటి వరకు అరకొరగా పాఠ్యపుస్తకాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభ సమయానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగులు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్యలో కేవలం 65 శాతం మేర మాత్రమే పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. మండలంలో 44 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్న పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా 35 శాతం పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండడంతో అందరు విద్యార్థులకు అందే అవకాశాలు లేవు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 28వేల పాఠ్యపుస్తకాలు అవసరమని అధికారులు విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపగా, కేవలం 18,219 మాత్రమే వచ్చాయి. 7వ తరగతికి సంబంధించి రెండు సబ్జెక్టుల పుస్తకాలు మాత్రమే రాగా, 8,9,10 తరగతులకు అన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయి. విద్యార్థులకు అవసరమైన బూట్లు, యూనిఫాం, బెల్టులు, స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు కూడా సరఫరా కాలేదు.

వారంలో పూర్తిస్థాయి సరఫరా

ప్రస్తుతం 1 నుంచి 10 తరగతి వరకు 18,219 పాఠ్యపుస్తకాలు మాత్రమే ప్రభుత్వం పంపించింది. మిగిలిన పుస్తకాలు వారం రోజుల్లో రానున్నాయి. ఈ విద్యాసంవత్సం ప్రారంభమైన వెంటనే అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో అందిస్తాం. విద్యార్థులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- జాన్ ప్రసాద్, ఎంఈఓ

మింగేసినది

శారదా నదిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు మృతి

ఎలమంచిలి, జూన్ 11: స్నానానికని నదిలో దిగిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని చెరువుపల్లి గ్రామం వద్ద శారదా నదిలో మంగళవారం జరిగింది. ఎలమంచిలి రూరల్ ఎస్.ఐ. సింహాచలం తెలిపిన వివరాల మేరకు... రాంబిల్లి మండలం దిమిలికి చెందిన ఎర్రంశెట్టి శ్రీనివాసరావు (22), గాజువాకకు చెందిన బంగారి జగన్ (18) మంగళవారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో గ్రామానికి అర కిలోమీటరు దూరంలో గల శారదా నది వద్దకు వెళ్లి స్నానానికి దిగారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో మునిగిపోయి మృతిచెందారు. శ్రీనివాసరావు ఐటీఐ చదువుకున్నాడు. జగన్ ఈ ఏడాది ఇంటర్ పూర్తిచేశాడు. వారం క్రితం దిమిలిలో గల తన మామయ్య ఇంటికి వచ్చాడు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా గాజువాకకు చెందిన జగన్ తండ్రి అక్కడి ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారని బంధువులు తెలిపారు. దిమిలికి చెందిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు కూలి చేస్తూ కుమారుడ్ని చదివిస్తున్నారని తెలిసింది. ఉద్యోగాలు సాధించి కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని భావించి కుమారులు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. వీరి మృతితో దిమిలి, తెరువుపల్లి గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.


మృతి చెందిన శ్రీనివాస్, జగన్

జడ్పీలో హడావిడిగా బిల్లులు

అధికారుల ఆరాటం

- రూ.3 కోట్ల చెల్లింపునకు కసరత్తు
- అకౌంట్స్ విభాగం నుంచి గ్రాంట్స్ సెక్షన్‌కు...
- అనుమానాలు అనేకం
- ఏజెన్సీలో రూ.కోటి బిల్లుకు మాత్రమే ఆమోదం: సీఈవో

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలోని పథకాల నిర్వహణ, మరమ్మతులు (ఆపరేషన్ అండ్ మెయింటెన్స్)కు సంబంధించి రూ.మూడు కోట్ల బిల్లులు చెల్లింపునకు అధికారులు తెగ ఆరాటపడుతున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌లోని అకౌంట్స్ విభాగం నుంచి మూడు రోజుల క్రితం బిల్లులు గ్రాంట్స్ విభాగానికి వెళ్లాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరే ముందు మూడు కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపునకు హడావిడి పడడంపై పలువురు ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు గ్రాంట్స్ విభాగానికి వచ్చిన మాట వాస్తవమేనని, అయితే జడ్పీ సీఈవో ఆమోదించలేదని సిబ్బంది చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 43 నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు సుమారు రూ.35 కోట్లు అవసరమని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు ప్రతిపాదించారు. అయితే 15వ ఆర్థిక సంఘం నుంచి జిల్లా పరిషత్ (జడ్పీ)కి వచ్చిన నిధుల నుంచి రూ.6.5 కోట్లు నీటి పథకాల నిర్వహణకు కేటాయించారు. మిగిలిన మొత్తం గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. గడచిన ఐదేళ్ల నుంచి నీటి పథకాల నిర్వహణకు ప్రభుత్వం కొద్దిమొత్తమే ఇవ్వడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలావుండగా జడ్పీ కేటాయించిన రూ.6.5 కోట్లకు సంబంధించి అనకాపల్లి జిల్లా నుంచి రూ.2.3 కోట్లకు ఈ ఏడాది మార్చి 15న బిల్లులు వచ్చాయి. పాడేరు డివిజన్ పరిధిలో పథకాల నిర్వహణకు ఖర్చు చేసిన

... మిగతా 2వ పేజీలో

విజయవాడకు తరలిన తెలుగు తమ్ముళ్లు



విజయవాడలో ఎమ్మెల్యే అనితను కలిసిన టీడీపీ నేతలు

పాయకరావుపేట, జూన్ 11 : తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో పాయకరావుపేట నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు మంగళవారం విజయవాడ బయలుదేరి వెళ్లాయి. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు విజయవాడలో ఎమ్మెల్యే వంగలపూడి అనితతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్‌లను కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యాళ్ల వరహాలబాబు, చిక్కాల శ్రీను, దేవవరపు రాజబాబు, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, దంతులూరి నాగు, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు తదితరులున్నారు.

తాళ్లమ్మకి మొక్కులు చెల్లించుకున్న కూటమి నేతలు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న కూటమి నేతలు

ఎలమంచిలి, జూన్ 11: ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెంలో మంగళవారం తాళ్లమ్మ అమ్మవారిని కూటమి నేతలు దర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అవుతుండడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు : డీఈవో



విద్యార్థులతో డీఈవో వెంకటలక్ష్మమ్మ

మునగపాక (తుమ్మపాల), జూన్ 11 : నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉంటుందని డీఈవో వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయానికి వచ్చిన మండలంలో పదో తరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభను కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అలాగే డాక్టర్ రెడ్డీ ఫౌండేషన్ జూనియర్ శక్తి విభాగం ప్రోత్సాహకాలకు ఎంపికైన విద్యార్థులను కూడా డీఈవో అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వై.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సీహెచ్. రామకృష్ణమూర్తి, గోవింద, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు



వేంపాడు టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూన్ 11: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూటమి నాయకులతో పాటు, కార్యకర్తలు పలు వాహనాల్లో మంగళవారం ఉదయం నుంచే విజయవాడ బయలుదేరారు. సాయంత్రం వరకూ అనేక వాహనాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళుతున్నారు. దీనిని దృష్టిలో వుంచుకుని పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైవేపై వాహనాల రద్దీ, ట్రాఫిక్ లేకుండా వేంపాడు టోల్‌ప్లాజా వద్ద సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.

ఎం.జగన్నాథపురంలో ఇంటింటా ధర్మప్రచారం



ధర్మప్రచారంలో పాల్గొన్న సమరసత ప్రతినిధులు

అచ్యుతాపురం రూరల్, జూన్ 11 : ఆచార సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ పాటించి హిందూ ధర్మాన్ని ఆచరించాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఎలమంచిలి ఖండ సంయోజకులు బీవీ రమణ అన్నారు. మంగళవారం ఎం.జగన్నాథపురంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మాన్ని పాటించడం ద్వారా మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, బంటు రాము, భీమును జోగినాయుడు, బంటు ఆనంద్, పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ అనుపోత్సవం

సబ్బవరం, జూన్ 11 : సబ్బవరం ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. సాయంత్రం కోలాటం, బాణసంచా కాల్పులు, నేల డ్యాన్స్‌లతో అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు ఆర్థిక సాయంతో డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శన జరిగింది.

'ప్రగడ'కు ప్రశంసల వెల్లువ



ప్రగడ నాగేశ్వరరావును అభినందిస్తున్న అభిమానులు

అచ్యుతాపురం రూరల్, జూన్ 11 : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విజయంలో కీలకపాత్ర పోషించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును పలువురు మంగళవారం అభినందించారు. పలువురు టీడీపీ నాయకులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు, శాలువలతో ప్రగడ నాగేశ్వరరావును సత్కరించారు.

విద్యుత్ కాంతుల్లో ఎంపీడీవో కార్యాలయాలు



విద్యుత్ కాంతులతో నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం



విద్యుత్ దీపాలంకరణతో అచ్యుతాపురం ఎంపీడీఓ కార్యాలయం

నక్కపల్లి, జూన్ 11: నాలుగోసారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో ధగధగ మెరిసిపోతున్నాయి. మంగళవారం రాత్రి నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాల వద్ద లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. పలువురు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి నేరుగా తిలకించేందుకు బయల్దేరి వెళ్లారు. డ్వాక్రా సంఘాలు, వెలుగు సిబ్బందికి సంబంధించి కొన్ని ప్రత్యేక వాహనాలను కూడా సిద్ధం చేశారు.

అచ్యుతాపురంలో.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం మంగళవారం విద్యుత్ దీపాలంకరణతో కళకళలాడింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి 8 గంటలకు మండలంలో గల వివిధ పంచాయతీల నుంచి కూటమి సభ్యులు బస్సులో వెళ్లారు. ఎంపీడీఓ సురేష్ కుమార్ దగ్గరుండి ఏర్పాట్లు చూసుకున్నారు. కాగా, మండలం నుంచి కూటమి నాయకులు మంగళవారం ఉదయం నుంచి వివిధ వాహనాల్లో అమరావతి తరలివెళ్లారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

- ఫిర్యాదు చేసిన పట్టించుకోని మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు
- ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని ప్రశ్నిస్తున్న స్థానికులు

ఎలమంచిలి, జూన్ 11: కోట్లాది రూపాయలతో రహదారి నిర్మాణం పూర్తి చేసిన అధికారులు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలను తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజల రాకపోకలు సాగిస్తూ రద్దీగా ఉండే ఈ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం కారణంగా ఏదైనా వాహనం ఢీకొని ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. తాము మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పట్టణవాసులు విమర్శిస్తున్నారు.

రెండు నెలల క్రితం ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.2.3 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రోడ్డు విస్తరణ ప్రారంభంలో రోడ్డుకడ్డంగా ఉన్న వాటిని తొలగించిన తర్వాత పనులు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. పనులు పూర్తి చేసిన అధికారులు రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు చర్యలు తీసుకోలేదు. పగలు మాటెలా ఉన్నా రాత్రి సమయాల్లో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. తమ వినతులను ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



స్టేషన్ రోడ్డుపై తొలగించని విద్యుత్ స్తంభం

కొత్తూరు పంచాయతీలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

- ఎంపీడీవోకు వార్డు సభ్యులు వినతి

కొత్తూరు, జూన్ 11 : అనకాపల్లి మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని అధికారులను వార్డు సభ్యులు తాడి చక్రవర్తి, నీటిపల్లి రాజు, పందల శ్రీను, బోడి సాయి, కరణం కన్నబాబు కోరారు. మంగళవారం ఈ మేరకు వారంతా ఎంపీడీవో పీవీవీ మోహన్‌కుమార్‌ను కలిసి అవకతవకలపై వినతిపత్రం అందజేశారు. గతంలో చెరువు గర్భంలోని అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారని, ప్రస్తుతం కొందరు మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అదే స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆశీల పాట గత మూడేళ్లుగా నిర్వహించకపోవడంతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందన్నారు. పారిశుధ్య ట్రాక్టర్ బ్యాటరీ దొంగలు తీసుకొని వెళ్లిపోయి పది రోజులు కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. పంచాయతీలో పారిశుధ్య వ్యవస్థ ఎక్కడికక్కడే నిలిచిపోయిందన్నారు. పంచాయతీకి చెందిన ఒక ట్రాక్టర్‌ను డ్రైవర్ ఇంటి వద్ద ఉంచడమేమిటని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదని, వాటిని తక్షణమే ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో అక్రమ కొళాయి కనెక్షన్లు ఇచ్చారని ఆరోపించారు. పంచాయతీ తీర్మానం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణానికి ప్లాను మంజూరు చేశారని, వాటికి సంబంధించి పంచాయతీ కార్యాలయంలో ఎటువంటి రికార్డులు లేవన్నారు. వీధిలైట్లు వెలగడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవో ఆగ్రహం

వార్డు సభ్యులు ఫిర్యాదుతో కార్యదర్శి శ్రీనివాసరావును ఎంపీడీవో మోహన్‌కుమార్ వెంటనే తన కార్యాలయానికి పిలిపించారు. పంచాయతీలో ప్రజలకు అవసరమైన పారిశుధ్య సమస్యలను ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. ఒక దశలో ఇక్కడ పని చేసే ఉద్దేశం ఉందా? లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయని వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని ఎంపీడీవో తేల్చి చెప్పారు. పారిశుధ్య ట్రాక్టర్ బ్యాటరీ అపహరణపై ఇప్పటి వరకూ పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. మరోసారి ఇటువంటి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఎంపీడీవో హెచ్చరించారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ వార్డు సభ్యులు

మలేరియాపై అవగాహన ర్యాలీలు

ఎస్.రాయవరం, జూన్ 11: మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల వైద్యాధికారిణిలు ఎస్ఎస్‌వీ శక్తి ప్రియ, ఎన్. వాసంతి, రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని సర్వసిద్ధి, ఎస్ రాయవరం, సైతారుపేట, పెనుగొల్లు, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీల్లో వైద్యులు మాట్లాడుతూ.. దోమల వలన పలు వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీలకు చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి అన్నారు. మలేరియా మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం తుమ్మపాలలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది బి. మంగమ్మ, ఎం. మరియమ్మ, బి. సంగం తదితరులు పాల్గొన్నారు.



సైతారుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హంతకుడికి పదేళ్ల జైలు

రూ.10 లక్షల జరిమానా

విశాఖపట్నం(లీగల్), జూన్ 11: హత్యా నేరానికి పాల్పడిన ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు పైలా రమణ అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శంబంగి గ్రామానికి చెందినవాడు. ఇదే గ్రామానికి చెందిన సర్ల వెంకటరమణతో పైలా రమణకు భూ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో 2014 అక్టోబరు 14న వీరిరువూ ఘర్షణకు దిగడంతో సుర్ల వెంకటరమణ తల, ముఖంపై పైలా రమణ ఇటుక, బండరాయితో కొట్టాడు. దీంతో వెంకటరమణ అక్కడకక్కడే మృతి చెందాడు. నాతవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

జడ్పీలో హడావిడిగా బిల్లులు

... 1వ పేజీ తరువాయి

రూ.కోటికి ఆరు నెలల క్రితమే బిల్లులు అందాయి. అయితే పాడేరు బిల్లుల మంజూరులో అధికారులు తాత్సారం చేశారు. ఈలోగా అనకాపల్లి జిల్లా నుంచి రూ.2.3 కోట్లకు మార్చిలో బిల్లులు వచ్చినా అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆమోదించలేకపోయారు. అయితే ఈనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు తరువాత సుమారు రూ.3 కోట్ల బిల్లులు ఆమోదించాలని అధికారులు ప్రయత్నాలు మొద లెట్టారు. ఈ నేపథ్యంలో అకౌంట్స్ విభాగం సిబ్బంది మూడు రోజుల్లో బిల్లులు స్క్రూటినీ చేసి గ్రాంట్స్ విభాగానికి పంపించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులు ఆమోదించవచ్చునని కొందరు చెప్పినా అధికారులు పట్టించుకోకుండా ముందుకువెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. కాగా బిల్లులు ఆమోదంపై జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు వద్ద ప్రస్తావించగా పాడేరు డివిజన్‌లో నీటి పథకాల నిర్వహణకు ఖర్చు చేసిన రూ.కోటి విలువైన బిల్లులు ఆమోదించాలని సిబ్బందికి ఆదేశించానన్నారు. ఆరు నెలల క్రితమే బిల్లులు వచ్చినా నిధులు లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. అనకాపల్లి నుంచి వచ్చిన బిల్లులతోపాటు మరికొన్ని బిల్లులు మొత్తం రూ.3 కోట్లకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

ర్యాంకుల పంట

... 1వ పేజీ తరువాయి

డి.సూర్యచంద్ర 49, జి.రియాజ్ 55, వై.శశికృతి 60, టి. సుహిత్ర 86, జి.జైకిషోర్ 89, బి.జయదీప్ 99వ ర్యాంకు సాధించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ స్ట్రీమ్‌లలో పాతిక మంది చొప్పున 100లోపు ర్యాంకు సాధించారు. నగరంలోని శ్రీచైతన్య, నారాయణ, శ్రీవిశ్వ, అసెంట్, ఆకాష్ తదితర కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులు ఎక్కువగా 1000లోపు ర్యాంకులు ఎక్కువగా సాధించారు. ఏపీఈఏపీసెట్‌లో టాప్ ర్యాంకర్లంతా దాదాపు ఐఐటీ/ఎన్ఐటీలలో ప్రవేశాలను అనువుగా ర్యాంకులు సాధించినవారే.

జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీలో కె.కుశాల్ ఒకటో ర్యాంకు (రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంకు), సీహెచ్.ధనుంజయ రెండోర్యాంకు (193వ ర్యాంకు), కె. సాయిచంద్ర కిరణ్‌నాయుడు మూడో ర్యాంకు (265వ ర్యాంకు), కేతఈ కార్తికేయ నాలుగోర్యాంకు (291వ ర్యాంకు), బి.విఘ్నేష్‌కుమార్ ఐదో ర్యాంకు (393వ ర్యాంకు), కైవశం చేసుకున్నారు. ఎ. దుర్గాలక్ష్మీనీలేశ్వర్ ఆరో ర్యాంకు (453వ ర్యాంకు), ఎ. మహేష్ ఏడో ర్యాంకు (490వ ర్యాంకు), కె.దినేష్‌కుమార్ ఎనిమిదో ర్యాంకు (495ర్యాంకు), వి.సుజన్‌కుమార్ తొమ్మిదో ర్యాంకు (541వ ర్యాంకు), జి. మారుతి పదో ర్యాంకు (674వ) ర్యాంకు వచ్చింది. 1000లోపు ర్యాంకులు 50, రెండువేల లోపు 100కుపైగా ర్యాంకులు వచ్చినట్టు అంచనా వేస్తున్నారు.

విస్తరణ ఒట్టిమాటే!

... 1వ పేజీ తరువాయి

చేస్తామని, వాహనాలు మలుపు తిరిగే సమయంలో ఎటు వంటి ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు అవసరమైన అంచనాలు తయారుచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు అప్పట్లోనే సూచించారు. ప్రస్తుతం ఈ జంక్షన్‌లో ఇరుకుమయంగా మారింది. విస్తరణ చేపడితే సమస్యలు తొలగిపోతాయని పట్టణ వాసులు భావిస్తున్నారు.

అమాత్యులెవరో?

... 1వ పేజీ తరువాయి

ఒకరికే అవకాశం ఉంటుందని విశ్వసనీయ సమాచారం. అయ్యన్నపాత్రుడు పార్టీలో సీనియర్. వైసీపీ ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొన్నారు. కేసులు నమోదయ్యాయి. కోర్టుల ద్వారా రక్షణ పొందారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఉత్తరాంధ్రలో ఇదే సామాజిక వర్గం నుంచి ఇద్దరు సీనియర్లు ఉన్నారు. ఒకరు అయ్యన్నపాత్రుడు కాగా మరొకరు అచ్చెన్నాయుడు. ఉత్తరాంధ్రలో ఈ సామాజిక వర్గానికి ఒకటే మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతోంది. అక్కడ అచ్చెన్నాయుడుకు పదవి దక్కితే ఇక్కడ అయ్యన్నకు అవకాశం ఉండదనే వాదన వినిపిస్తోంది.

రెండోవారు పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు. పోలీసుల వేధింపులు ఎదుర్కొన్నారు. మహిళ, ఎస్సీ కోటాలో ఈసారి ఆమెకు పదవి గ్యారంటీ అనే మాట వినిపిస్తోంది.

జనసేన నుంచి...

ఉత్తరాంధ్రాలో జనసేన పార్టీ నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నిమ్మక జయరాజు (ఎస్‌టీ), విజయనగరం జిల్లా నెల్లిమర్ల నుంచి లోకం మాధవి, విశాఖ జిల్లా దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ, పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజకుమార్ గెలిచారు. ఉత్తరాంధ్ర నుంచి ఒకరికి మంత్రి పదవి ఇస్తారని అంటున్నారు. వీరిలో కొణతాల రామకృష్ణ సీనియర్. ఆయన కాంగ్రెస్ పార్టీలో వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా చేశారు. ఆ తరువాత పంచకర్ల రమేశ్‌బాబు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాపు సామాజికవర్గం. మిగిలిన వారంతా తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైనవారు. ఈసారి యువతకు, కొత్తవారికి అవకాశం ఇస్తారని అంటున్నారు. అదే నిజమైతే విశాఖ నుంచి పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా నుంచి అనితకు పదవులు ఖాయంగా కనిపిస్తోంది.

పంచదార్ల చెరువులో మట్టి తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు



పంచదార్ల చెరువులో మట్టి తవ్వకాలు జరిపిన దృశ్యం

రాంబిల్లి, జూన్ 11 : మండంలోని పంచదార్ల సమీపంలోని చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు దర్జాగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో మట్టికి, గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండడంతో మండలంలోని పంచదార్ల కొండ, చెరువులపై పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న భూములు, ఇళ్ల పునాదులు కప్పేందుకు, ఇటుక బట్టీలకు అవసరమైన మట్టికి మంచి గిరాకీ ఉంది. దీంతో అక్రమార్కులు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా పంచదార్ల సమీపంలోని చెరువులో రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. కొన్ని రోజులుగా రాత్రి సమయంలోనే ఈ చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు. రోడ్డును ఆనుకొని పొలాలను చదును చేసుకొనేందుకు మట్టిని డంప్ చేస్తుండడంతో పాటు ఇళ్ల పునాదులు కప్పుతున్నా.. అధికారులు కనీసం పట్టిపంచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి దూరాన్ని బట్టి రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఈ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 11: రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్ర మంత్రులు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. స్థానిక న్యూకాలనీలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రానికి సంబంధించి కేంద్ర మంత్రులకు కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కడం ఆనందదాయకమన్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునే బాధ్యత పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మపై ఉందన్నారు. ఎన్డీయే కూటమిలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయాలని, రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో అలుపెరగని పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బోయిన భానుమూర్తియాదవ్, మలపురెడ్డి కోటేశ్వరరావు, పీఎస్ దత్తు, కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాంబ ఆలయ వార్షికోత్సవం

పరవాడ, జూన్ 11 : ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలెం దుర్గామాంబ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బొద్దపు నాయుడు, బొద్దపు లక్ష్మణరావు, బొద్దపు అప్పారావు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, బొద్దపు వెంకటరమణ, చందక గోవిందరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

'ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రాండ్ మాస్టార్ నూకరాజు

పరవాడ, జూన్ 11 : నేటి యువత ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని సీనియర్ గ్రాండ్ మాస్టార్ సారిపల్లి నూకరాజు అన్నారు. మండలంలోని జాలారిపేట, సమ్మంగిపాలెం, మంగప్పయ్యగారి ఊరు, కోరంగిపాలెం గ్రామానికి చెందిన డ్రాగన్ లయన్స్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు వాడచీపురుపల్లి హైస్కూల్‌లో మంగళవారం ఆల్ కలర్ బెల్టు బెస్ట్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో రాణించిన 15 మంది విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు ఒలిశెట్టి ప్రసాద్, గొర్లి పుష్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి జాతర



భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జూన్ 11: మండలంలోని చినతీనార్లలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. అనేక మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. పుష్పమాలలతో ఆలయాన్ని అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర మత్స్యకార జేఏసీ అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య, పిక్కి కోదండరాం, వాసుపల్లినూకరాజు, అర్జిల్లి శ్రీను, శ్రీనివాస్, కంబాల రాజు, నూకనాధం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తుమ్మపాల, జూన్ 11 : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడనున్న కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. గత ప్రభుత్వం కార్మికులను తీవ్రంగా మోసగించిందన్నారు. సంక్షేమ బోర్డులోని నిధులు రూ.1,600 కోట్లు పక్కదారి పట్టించిందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి కార్మికులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అప్పలరాజు, సత్యనారాయణ, నాగరాజు, ఆదినారాయణ, శ్రీను పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూన్ 11: జాతీయ రహదారిపై పూడిమడకకు వెళ్లే జంక్షన్‌లోని వంతెనపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. ఎలమంచిలి వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో 30 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి దుర్మరణం చెందారన్నారు. అతని తల,రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయన్నారు. అడ్డగీతల హ్యాఫ్‌హ్యాండ్స్ టీ షర్టు, ముదర నీలపురంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, మరే ఇతర ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించినట్టు ఆయన తెలిపారు. ఎవరైనా మృతుని ఆధారాల ప్రకారం గుర్తిస్తే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రాజు

పరవాడ, జూన్ 11: మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి గౌతులచ్చన్ననగర్ సమీపంలో మంగళవారం ఉదయం విద్యుదాఘాతంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ గ్రామానికి చెందిన తేలు రాజు మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో గౌతులచ్చన్ననగర్ వద్ద గల చికెన్ సెంటరుకు ఆటోలో వెళ్లాడు. ఆటో దిగి చికెన్ కొనేందుకు షాపు వద్ద నిలబడగా ఒక్కసారిగా షాక్‌కు గురై వెనక్కి పడిపోయాడు. కరెంట్ షాకుతో కిందపడిపోయిన రాజు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు అతన్ని సపర్యయాలు చేసి పరవాడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసేవలు అనంతరం మంగళవారం సాయంత్రం అతన్ని డిశ్చార్జి చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన కొంత దూరంలో 220 కేవీ టవర్‌లైన్ పనులు జరుగుతున్నాయి. టవర్ లైన్ కింద 11 కేవీ లైన్ కూడా ఉంది. పనులు జరుగుతున్న సమయంలో ఇంజక్షన్స్ పేలిపోవడంతో ఆ ఎఫెక్ట్ రాజుపై పడింది. అప్పటికే కాళ్లకు చెప్పులు లేకపోవడంతో పడిపోయాడు. 11కేవీ లైన్ కిందే చికెన్ సెంటర్ ఉంది. ఆ సమయంలో 11 కేవీ స్తంభం వద్ద పెద్ద శబ్దం రావడంతో సమీపంలోని షాపుల్లో విద్యుత్ మీటర్లు కాలిపోయాయి. మరో మూడు షాపుల్లో ఇన్వెటర్లు మరమ్మతులకు గురయ్యాయి.

గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్

ఎస్.రాయవరం, జూన్ 11: నర్సీపట్నం రోడ్డు, రేగుపాలెం రైల్వే స్టేషన్లకు మధ్య భీమవరం సమీపంలో మంగళవారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (30) మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు గూడ్స్ రైలు వెళుతున్న సమయంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది తెలియలేదన్నారు. మృతుడు చామన ఛాయ రంగు కలిగి సిమెంట్ రంగు ఫ్యాంటు, డార్క్ గ్రే ఫుల్ హాండ్స్ గడుల షర్టు ధరించి మాచిన గడ్డంతో ఉన్నాడని ఆయన చెప్పారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9494887786 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ మారూఫ్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ముప్పు

- గోకులపాడులో ఓ ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ
- డివైడర్, కాలువ ఉండడంతో తప్పిన ప్రమాదం



గోకులపాడు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ

ఎస్.రాయవరం, జూన్ 11: మండలంలోని గోకులపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద ప్రమాదం తప్పింది. అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న లారీ గోకులపాడు వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఓ ఇంటి పైకి దూసుకెళ్లింది. అయితే డివైడర్, కాలువ ఉండడంతో లారీ వెనుక చక్రాలు కాలువలోకి దిగడంతో ఇంటి మెట్ల భాగాన్ని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా.. ఆ ఇంటి మెట్ల భాగం దెబ్బతింది. అయితే లారీ ఇంటి పైకి దూసుకొచ్చిన సమయంలో ఆ ఇంట్లో నలుగురు నిద్రిస్తున్నారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని, ప్రమాదానికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు.

నరవలో భారీ చోరీ

- ఆయిల్ వ్యాపారి ఇంట్లో 17 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ
- చోరీ వస్తువులతో పార్కింగ్ చేసిన బైక్‌తో ఉడాయింపు

పెందుర్తి, జూన్ 11: నరవలో భారీ చోరీ జరిగింది. ఓ ఆయిల్ వ్యాపారి ఇంట్లో భద్రపరిచిన 17 తులాల బంగారం, రూ.మూడు లక్షల నగదు, బైకును అపహరించుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. నరవకు చెందిన అండి అప్పారావు అనే వ్యక్తి గోపాలపట్నంలో ఆయిల్ మిల్లు నడుపుతున్నారు. సోమవారం రాత్రి నరవలో అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని వీక్షించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. సంబరం చూసుకుని అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటికి చేరుకుని తాళం తీస్తుండగా వెనక తలుపు తాళం విరగ్గొట్టినట్టు కనిపించింది. దీంతో ఆందోళన చెంది లోపలకు వెళ్లి చూడగా ఇల్లంతా చిందరవందరగా ఉండడంతో పాటు బెడ్ రూమ్‌లో గల బీరువా తెరిచి ఉంది. అందులో భద్రపరిచిన 17 తులాల బంగారం, మూడు లక్షల రూపాయల నగదుతో పాటు ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైకు కనిపించలేదు. కాగా ఇంటి కింద మరో గదిలో ఉంటున్న ఆయిల్ మిల్లు వర్కర్లుగా పనిచేస్తున్న భార్యాభర్తలు కూడా కనిపించలేదు. వారింటి పరిసరాల్లో బంగారు ఆభరణాలు భద్రపరిచే బాక్స్‌లు కనిపించాయి. ఆరు నెలల కిందట ఆయిల్ మిల్లులో పనిలో చేరిన ఒడిశాకు చెందిన ఈ భార్యాభర్తలే చోరీకి పాల్పడినట్టు అండి అప్పారావు భావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534



విజయవాడలో జరిగిన కూటమి శాసనసభ పక్ష సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని పలకరించిన నారా లోకేష్. చిత్రంలో చోడవరం ఎమ్మెల్యే రాజు ఉన్నారు



విజయవాడలో జరిగిన శాసనసభ పక్ష కూటమి సమావేశానికి హాజరైన జనసేన శాసన సభ్యులు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్

కంప్యూటర్ ఇంజనీర్ చేస్తా..



ర్యాంకు: 193
ఇంటర్మీడియట్ మార్కులు : 972
తల్లిదండ్రులు : చోడిశెట్టి కాశీవిశ్వనాథ్ బిజినెస్, తల్లి గంగావరలక్ష్మి గృహిణి.
లక్ష్యం : కంప్యూటర్ ఇంజనీర్
ఏం కావాలనుకుంటున్నారు : జేఈఈ మెయిన్స్‌లో (ఈడబ్ల్యూఎస్) 256 ర్యాంకు వచ్చింది. ఐఐటీలో సీటు సాధించి మేథమెటిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేయాలనుకుంటున్నాను.

ఐఏఎస్ చేస్తా..



పేరు: కసిరెడ్డి సాయిచంద్రకిరణ్ నాయుడు
ఎంసెట్ ర్యాంకు: 265
సీబీఎస్ఈ : 482/500
తల్లిదండ్రులు: కసిరెడ్డి ప్రసాద్ (వ్యాయామ ఉపాధ్యాయుడు),
తల్లి: కనకమహాలక్ష్మి (గృహిణి)
లక్ష్యం : ఐఏఎస్. కంప్యూటర్ కోర్సులో ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరుతాను
ఏమి కావాలనుకొంటున్నారు: ఐఏఎస్ కావాలని ఉంది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని అవుతా..



ర్యాంకు : 453
ఇంటర్మీడియట్ మార్కులు : 969
తల్లిదండ్రులు : తండ్రి అంబటి అప్పారావు బిజినెస్‌మెన్.
తల్లి అంబటి మాధవి, పాయకరావుపేట వైస్ ఎంపీపీ
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.
ఏం కావాలనుకుంటున్నారు : జేఈఈ మెయిన్స్‌లో 321 ర్యాంకు వచ్చినందున ఐఐటీలో చేరి కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతాను.

వీధి..వీధికీ వెతలు..

ప్రజా సమస్యలపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం

- డ్రైనేజీలపై పాడైన పలకలు
- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు, వాహనదారులు
- పూడుకుపోయిన డ్రైనేజీలు
- పూడికతీతకు నోచుకోని యానాద్రి కాలువ
- ఎలమంచిలి మునిసిపాలిటీ దుస్థితి



కొత్తపేటలో పదేళ్లుగా పూర్తిస్థాయి పూడికతీతకు నోచుకోని యానాద్రి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఎలమంచిలి, జూన్ 11: మునిసిపాలిటీలో వీధి.. వీధికి ఒక వెత వెంటాడుతోంది. ఓ వీధిలో డ్రైనేజీపై పలకలు పాడైపోయి ఉంటే... మరో వీధిలో డ్రైనేజీ పూడిపోయి ఉన్నాయి. ప్రధాన డ్రైనేజీలు సైతం ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోకపోవడం, అధ్వానంగా అంతర్గత రహదారులు, కచ్చా డ్రైన్‌లు, డ్రైనేజీల్లో తాగునీటి కొళాయిల పైపులైన్‌లు, కల్వర్టులపై పలకలు ఏర్పాటు లేకపోవడం, తాగునీటి కొళాయిలకు చప్టాలు అస్తవ్యస్తంగా ఉండడం వంటివి పట్టణంలో రాజ్యమేలుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారంలో అటు పాలకులు, ఇటు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.



ఎలమంచిలి ప్రధాన మార్కెట్ వీధిలో రోడ్డుపై ఉన్న డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదభరితంగా ఉన్న కాలువ

ఎలమంచిలి పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి పదేళ్లు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. మునిసిపాలిటీలోని ధర్మవరం, కొత్తపేట, గాంధీనగర్, పెదపల్లి, కొత్తపాలెం వార్డుల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధిక శాతం వార్డుల్లో తాగునీటి కొళాయిల చప్టాలు శిథిలమై నీరు పట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. వీటిని పునరుద్ధరించడంలో అధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రధానంగా ధర్మవరం, గాంధీనగర్‌లతో పాటు పలు చోట్ల తాగునీటి కొళాయిల పైపులైన్లు డ్రైనేజీల్లోనే దర్శనమిస్తున్నాయి. వీటిని ఏర్పాటు చేసి30 ఏళ్ల పైబడి కానుండడంతో ఈ పైపులైన్లు ఎక్కడ లీకయి డ్రైనేజీలోని మురుగు నీటి కొళాయిల్లో సరఫరా అవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో ధర్మవరం, కాకివానివీధి, పెదపల్లి రోడ్డు, తెరువుపల్లి ప్రాంతాల్లో కచ్చా డ్రైన్‌లకు మోక్షం కలుగడం లేదు. కచ్చా డ్రైన్‌లను ఆధునీకరించడంలో మునిసిపల్ అధికారులు శ్రద్ధ వహించడం లేదు. మునిసిపాలిటీలోని కొత్తపేట ప్రాంతంలో 10 సంవత్సరాలుగా యానాద్రి కాలువలో పూర్తి స్థాయి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కాలువలో మురుగు ముందుకు పారలేదు. డబ్బీరు వారి వీధిలోని యానాద్రి కాలువ వద్ద భారీగా పూడిక పేరుకుకోవడంతో చిన్నపాటి చినుకు పడినా స్థానికంగా ఉన్న ఇళ్లలోకి వర్షం నీరు వస్తున్నది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గత కొన్ని నెలలుగా మునిసిపల్ పాలనపై అటు అధికారులు కానీ, పాలకవర్గం కానీ దృష్టి సారించలేదు. ఎన్నికలు పూర్తి కావడంతో మునిసిపల్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పెదపల్లి రోడ్డులో పూడుకుపోయిన డ్రైనేజీ

అనారోగ్యంతో తల్లిదండ్రులు మృతి

అనాథలుగా మారిన చిన్నారులు

- వారిని సాకుతున్న గొల్లలపాలెం గ్రామస్థులు
- ఆపన్నహస్తం కోసం చిన్నారులు ఎదురుచూపు



మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులు నూకరాజు, కనకమ్మ



తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారిన చిన్నారులు

సబ్బవరం, జూన్ 11: తండ్రి అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండేవాడు. తల్లి కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకు వచ్చేది. పిల్లలు ఇద్దరు ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునేవారు. మూడు నెలల క్రితం అనారోగ్యంతో ఉన్న తండ్రి చనిపోయాడు. దీంతో మనోవేదనకు గురై అనారోగ్యం పాలైన తల్లి కూడా ఈనెలలో మృతి చెందింది. దీంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. తల్లిదండ్రులు మృతి చెంది అనాథలైన ఆ చిన్నారులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గొల్లలపాలెం ఎస్సీ కాలనీలో చందా నూకరాజు (35), కనకమ్మ (30) భార్యాభర్తలు. వీరికి పవన్‌కుమార్, అర్జున్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. నూకరాజు అనారోగ్యంతో ఇంటి పట్టునే ఉండేవాడు. భర్త, ఇద్దరి పిల్లలను కనకమ్మ కూలి పని, పాచి పని చేస్తూ సాకేది. వీరి కుటుంబం సాఫీగా సాగుతుండగా మూడు నెలల క్రితం భర్త నూకరాజు మృతి చెందాడు. భర్త మృతి చెందినప్పటి నుంచి కనకమ్మ మనోవేదనకు గురైంది. పిల్లల గురించి దిగులు చెందుతూ.. అనారోగ్యం పాలైంది. ఆమె ఈనెల ఒకటో తేదీన మృతి చెందింది. గ్రామస్థులు ఆమెకు అంత్యక్రియలు చేశారు. తల్లిదండ్రులు మృతితో ఆ చిన్నారులు ఇద్దరు అనాథలయ్యారు. పెద్ద కుమారుడు పవన్‌కుమార్ ప్రస్తుతం సబ్బవరం గురుకుల పాఠశాలలో పదో తరగతి, చిన్నకుమారుడు అర్జున్ నంగినారపాడు జడ్పీ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం ఆ పిల్లల ఆలనా పాలనా చూసే పెద్ద దిక్కు ఎవరూ లేకుండా పోయారు. గ్రామస్థులు ప్రస్తుతం ఆ పిల్లలను సాకుతున్నారు. ఆ పిల్లల్ని ఎవరైన దాతలు కానీ, ప్రభుత్వం కానీ ఆదుకోవాలని గొల్లలపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం రాజీనామా



కార్యదర్శి శకుంతలకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చైర్మన్, సభ్యులు

అనకాపల్లి టౌన్, జూన్ 11: అనకాపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం తమ పదవులకు మంగళవారం రాజీనామా చేసింది. ఈ మేరకు మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల వివరాలు వెల్లడించారు. మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కరక సోమునాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, కటారి దుర్గ, బొడ్డు జయ, దాడి తులసీకుమారి, ఈగల నూకరత్నం, తెరపల్లి లక్ష్మి, దాడి కుమార్ వరహా కృష్ణ, ఒమ్మి మోదినాయుడు, కోలపర్తి కన్నబాబు, గుండా రమేష్‌గుప్తా, గొంతిన శివలు తమ రాజీనామా పత్రాలను అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో ప్రజా తీర్పును గౌరవిస్తూ, తమ నామినేటెడ్ పదవులకు రాజీనామా చేశామని చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు.

ఎలమంచిలిలో నామినేటెడ్ పదవులకు...

ఎలమంచిలి: నియోజకవర్గంలో పలువురు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) అధ్యక్షులు తమ పదవులకు రాజీనామా చేసినట్టు మంగళవారం ప్రకటించారు. ఎలమంచిలిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్, రాంబిల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు యు.సుకుమార్‌వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎర్రయ్యదొర, కొక్కిరాపల్లి, దిమిలి, దప్పుతూరు, లక్కవరం, మునగపాక, తిమ్మరాజుపేట, పెదపాడు, చూచుకొండ పీఏసీఎస్ చైర్మన్లు మళ్ల కొండబాబు, సిరసపల్లి రామారావు, శెట్టి నాగేశ్వరరావు, జంపన అచ్చుతరామరాజు, కోనపల్లి రామ్మోహనరావు, కాండ్రేగుల అప్పారావు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట హరేరామ్ తమ పదవులకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను మీడియా ఎదుట ప్రదర్శించారు.

ఎలమంచిలి ఏఎంసీ వైస్ చైర్మన్ పదవికి శ్రీనివాస్ రాజీనామా

రాంబిల్లి, జూన్ 11: ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు మండలంలోని వెల్చూరుకు చెందిన సిరిదెల్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్టు ఆయన తెలిపారు.

విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది



సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, జూన్ 11: ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే జీవో నంబరు 117ను రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిందన్నారు. ఆ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని కోరారు. గతంలో ఉన్న మాదిరిగా మూడంచెల విధానంలోనే పాఠశాలలను ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయిత్రి, కార్యదర్శులు చంద్రరావు, జీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జూన్ 11: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ప్లాంట్‌కు చెందిన దీపాంజలినగర్‌లోని క్రీడా ప్రాంగణంలో సోమవారం రాత్రి వాలీబాల్, త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో రామగుండం, కుడ్గి, తెలంగాణ, సదరన్ రీజియన్ హెచ్ క్యూ, సింహాద్రి ప్లాంట్‌కు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. మూడు రోజులు పాటు పోటీలు కొనసాగుతాయన్నారు. తొలుత క్రీడాకారులందరిని సీజీఎం పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి సీపీజీ-3 విభాగం సీజీఎం ఆర్ఆర్ పరిదా, వివిధ విభాగాల జీఎంలు డేవిడ్, వీటీ కాంబ్లే, ఎస్.పద్మప్రియ, బీబీ పాత్ర, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పాదాలకు నీలాభిషేకం

మాడుగుల, జూన్ 11: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి పాదాలకు మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నీలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ వెనక భాగంలో వంటా- వార్పు చేసుకొని వన భోజనాలు చేశారు. ఇదిలాఉండగా, ఈనెల 18వ తేదీన జరిగే జాతర మహోత్సవం సందర్భంగా శతకంపట్టు వద్ద కొలువైన అమ్మవారి ఘటాలకు, పాదాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు అన్ని వీధుల నుంచి బిందెలతో పసుపు నీళ్లను తీసుకువచ్చి అమ్మవారి పాదాలకు అభిషేకం చేశారు. భక్తులకు సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

కొత్త కూర్పు

నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. కొత్త మంత్రివర్గం 71 మందిలో ముప్పైమందికి కేబినెట్ హోదా లభించింది. ఐదుగురు స్వతంత్ర, ముప్పై ఆరుగురు సహాయ మంత్రులు ఉన్నారు. మిత్రపక్షాల కరుణాకటాక్షాల ఆధారంగా దేశాన్ని ఏలాల్సిన స్థితిలో ఉన్నప్పటికీ, నరేంద్రమోదీ ఈ మంత్రివర్గ కూర్పులో తనదే పైచేయి అనిపించుకున్నారని, ఊతమిస్తున్నవారి ఒత్తిళ్ళకు పెద్దగా లొంగ లేదని కొందరి విశ్లేషణ. కొందరు పాతవారు పోయి, శాఖల్లోనూ మార్పు చేర్పులు ఉన్నా, అధికంగా గత మంత్రులే ఉన్నందున మార్పు ప్రభావవంతంగా అగుపించడం లేదు. సొంతబలం లేకున్నా కూడా, గతకాలపు కొనసాగింపుగానే కనిపించాలన్న ప్రత్యేక ప్రయత్నం ఈ మంత్రివర్గం కూర్పులో అత్యధికులకు కనిపిస్తున్నది.

ఆర్థికం, హోం, రక్షణ, విదేశీవ్యవహారాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రైల్వేల వంటి కీలకమైన శాఖల్లో ఏ మార్పూలేదు. ఈ మారు కూడా మంత్రుల్లో ముస్లింలు లేరు. ఏడుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, ఏడుగురు మహిళలకు మోదీ టీంలో చోటుదక్కింది. యూపీ నేర్పిన గుణపాఠం వల్ల కాబోలు, ఓబీసీల ప్రాతినిధ్యం కూడా గట్టిగానే ఉంది. పంజాబ్‌లో బలంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీతోనూ, కేరళలో ఎల్‌డీఎఫ్‌తోనూ యుద్ధం కొనసాగించాలి కనుక, తమిళనాడులో ఎదురుదెబ్బ తిన్నా విస్తరణయత్నాలు ఆగకూడదు కనుక ఆ రాష్ట్రాలనుంచి ఓడినవారికి కూడా ప్రాతినిధ్యం లభించింది. ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హతమైన కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనుమడు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ ద్వారా పంజాబ్‌లో ఎదగాలన్నది బీజేపీ ప్రయత్నం. ఒక్కసీటూ గెలవకపోయినా ఆప్, కాంగ్రెస్ తరువాత ఓట్లవాటాలో మూడోస్థానంలో ఉన్నందున బీజేపీ ఆశని కాదనలేం. కేరళలో ఒక్కసీటు గెలిచి ఖాతా తెరిచిన సంతోషంలో ఆ రాష్ట్రానికి రెండు పదవులు ఇచ్చినా, నటుడు సురేష్ గోపి అలగడం, రాజీపడటం తప్పలేదు. కేరళలో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్లవాటా 17శాతం తాకి, 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి బలాన్ని ప్రదర్శించిన నేపథ్యంలో, జార్జి కురియన్ ఎంపిక క్రైస్తవులకు సానుకూల సంకేతం పంపేందుకు ఉపకరిస్తుంది. తమిళనాట వీరోచిత పోరాటం చేసిన ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అన్నామలై కాక, గతకాలపు నేత లోగనాథన్ మురుగన్‌ను మంత్రిగా తీసుకోవడం వెనుక దళిత ఉపకుల రాజకీయం ఉన్నదని అంటారు. ఇప్పుడు అంతగా ఆదరించనప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రాల ప్రజల మనసులను గెలుచుకోవడానికి ఈ పందేరం ఉపకరిస్తుంది.

కొత్త మంత్రివర్గాన్ని యువతరం, అనుభవజ్ఞులతో ఎంతో చక్కగా గుదిగుచ్చామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. ఐదుగురు తెలుగువారికి కేంద్రంలో చోటు దక్కడం అటుంచితే, మిత్రపక్షాలకు మొత్తంగా పదకొండు, ఐదుపార్టీలకు ఒక్కటి చొప్పున పదవులు దక్కాయి. బిహార్‌లో ముగ్గురు మిత్రులకు నాలుగు పదవులు ఇచ్చినా, మహారాష్ట్రలో ఎన్సీపీని చీల్చి, అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను తెచ్చిన అజిత్‌పవార్‌తో ఇక అవసరం తీరిపోయిందని బీజేపీ భావిస్తున్నట్టుగా చర్చ జరుగుతోంది. ఎన్సీపీ మినహా అన్ని మిత్రపక్షాలకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఇక, ఈ ఏడాది ఎన్నికలు ఉన్నందున మహారాష్ట్ర, హర్యానాలకు తగిన ప్రాతినిధ్యమే దక్కింది. ఖట్టర్‌ను తీసుకోవడం, మూడు పదవులు ఇవ్వడంలో హర్యానాను జారవిడుచుకోకూడదన్న ప్రయత్నం బలంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర కంటే, ఢిల్లీ పొరుగున ఉన్న హర్యానాలో ఓడిపోతే ఆ ప్రభావం నైతికంగా కేంద్రప్రభుత్వం మీద పనిచేస్తుంది.

గత ప్రభుత్వంలోని కీలకమైన మంత్రులను అదేశాఖలో కొనసాగించడం, నడ్డావంటివారిని కొత్తగా తేవడం వంటివి గమనించినప్పుడు మంత్రివర్గ కూర్పులో బీజేపీ ముద్ర విశేషంగా కనిపిస్తుంది. మిత్రపక్షాల అవసరం ఎంత ఉన్నప్పటికీ, వారిని కొంతమేరకే సంతృప్తిపరచి తనదే పైచేయి అనిపించుకుంది. కేబినెట్ మంత్రుల్లో పాతికమంది బీజేపీవారే అయినప్పటికీ, మిత్రపక్షాల ప్రాతినిధ్యం ఈ దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దేశంలోని వేర్వేరు ప్రాంతాలనుంచి వచ్చినవారు మంత్రివర్గం పనితీరు మరింత మెరుగుపడేందుకు ఉపకరిస్తారు. భవిష్యత్తులో మంత్రివర్గాన్ని విస్తరించుకొనే వెసులుబాటు ఇంకా మిగిలివున్నందున, రాజకీయంగానో, సామాజిక కారణాలరీత్యానో స్వపక్షంనుంచో, మిత్రపక్షాలనుంచో మరికొందరికి చోటుకల్పించే అవకాశాలైతే లేకపోలేదు. అప్పుడు మరిన్ని వింతలూ విశేషాలు చూడవచ్చు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు

విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి ఆలోచించేవారు బహు అరుదు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరావాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకురావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం.

గల్ఫ్ లేఖ

చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ-కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ-కామర్స్ కేంద్రంగా పురుడు పోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మొహమ్మద్ రాషేద్ అల్ మోఖ్తుం ఆశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు.



అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు.

పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్‌లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది.

ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు.

దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు.

2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్‌లోని భారత రాయబారి దీపా వాధ్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది.

అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, అబుధాబి రాజు షేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు.

ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మార్పు ప్రజలు ఆశించిందేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఒక అమ్మాయి తన తల్లిదండ్రుల వద్ద ఉన్నంత కాలం స్వేచ్ఛగా, పెద్దగా బరువు బాధ్యతలు లేకుండా ఉంటుంది. అయితే వివాహం చేసుకుని మరో ఇంట్లో అడుగు పెట్టాక అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఉండవలసి వస్తుంది. అన్నింటినీ ఆకళింపు చేసుకుని తన బాధ్యతలేమిటో అర్థం చేసుకోవల్సి ఉంటుంది. మన వెంకయ్యనాయుడు కూడా ఇప్పటి వరకూ పార్లమెంట్ సభ్యుడుగా, కేంద్రమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. ఉభయ సభల్లోనూ, ఇతర సమావేశాల్లోనూ అనర్గళంగా మాట్లాడారు. కాని ఇప్పుడు ఆయన ఉపరాష్ట్రపతి. అది ఒక రాజ్యాంగ హోదా. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కనుక ఆయన కూడా పుట్టింటి నుంచి మెట్టినింటికి వచ్చినట్లు కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. అది ఆయనకు తెలుసు' అని 2017 ఆగస్టు మొదటి వారంలో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును పార్టీ ఎంపీల సమావేశంలో అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నప్పుడు హాజరైనవారందరూ నవ్వుల వర్షం కురిపించారు. 'మోదీ ఎంత సహజమైన ఉదాహరణనిచ్చారు!' అని ఒకరిద్దరు వ్యాఖ్యానించారు.

2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుంచి ఇప్పటి వరకూ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీ కూడా ఇప్పుడు ఒక కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకూ ఆయన సారథ్యంలో బీజేపీ ఎన్నిసార్లు పోటీ చేసినా అన్నిసార్లు అత్యధిక మెజారిటీ సాధించింది. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నా, 10 సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఇతర పార్టీల బలంపై ఆధారపడవలసిన అవసరం ఆయనకు రాలేదు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏకు పూర్తి మెజారిటీ వచ్చినా, ఆయన స్వంత పార్టీ బీజేపీకి పూర్తి సంఖ్యాబలం రాలేదు. ఎన్నికలకు ముందే ఒక కూటమిగా ఏర్పడిన ఎన్డీఏకు సారథిగా కూడా మోదీయే ఉన్నందువల్ల ఆయన నాయకత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదు కాని ఒక రకంగా గత 23 సంవత్సరాల ఆయన అనుభవంతో పోలిస్తే ఇప్పుడు ఆయన నిర్వహించేది కొత్త సంసారమే అని చెప్పక తప్పదు. ఎందుకంటే గతంలో మోదీ ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించలేదు.

అయితే 1999–2004 మధ్య అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో బీజేపీ ఏర్పర్చిన సంకీర్ణ ప్రభుత్వానికీ, ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వానికీ కొన్ని పోలికలు ఉన్నాయి. నిజానికి అప్పుడు ఎన్డీఏ ఇప్పటి ఎన్డీఏ కంటే ఆరు సీట్లు ఎక్కువ సాధించింది. కాంగ్రెస్ ప్రధానుల తర్వాత అయిదేళ్లు పాలించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా గుర్తింపు పొందిన వాజపేయి సారథ్యంలో నాడు ఎన్డీఏకు 299 సీట్లు రాగా ఇప్పుడు మోదీ సారథ్యంలోని ఎన్డీఏకు 293 సీట్లు లభించాయి. నాడు కూడా కాంగ్రెస్ కేవలం 112 సీట్లతో చాలా బలహీనంగా ఉండేది. 1999లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల సంఖ్యాబలం 134 మాత్రమే. ఇప్పుడు 232 సీట్లు సాధించిన ఇండియా కూటమి కంటే ఈ బలం ఎంతో తక్కువ. బీజేపీకి రెండుసార్లు మెజారిటీ సాధించి పెట్టి పదేళ్ల ప్రభుత్వాన్ని తిరుగులేకుండా నిర్వహించిన మోదీ ఇప్పటికే చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఒక సంకీర్ణ ప్రభుత్వానికి సారథిగా అయిదేళ్ల పాలనను నిర్వహించిన పీవీ, వాజపేయి, పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వాన్ని నిర్వహించిన మన్మోహన్ సింగ్ కూడా చరిత్రలో నిలిచిపోయిన నాయకులే. జాతీయ స్థాయిలో మెజారిటీ సంఖ్యాబలంతో ప్రభుత్వాన్ని పదేళ్ల నిర్వహించిన వ్యక్తే సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించవలసి వచ్చిన ఉదంతాలు భారతదేశంలో లేవు. అయినప్పటికీ మోదీ ఈ బాధ్యతను అవలీలగా నిర్వహిస్తారన్న విషయంలో అనుమానాలు అక్కరలేదు. అందుకు అనేక కారణాలున్నాయి.

ఒకటి, ఎన్డీఏలో బీజేపీ ఇప్పుడు 240 సీట్లు సాధించిన బలమైన పక్షం. కేవలం 32 సీట్లు అదనంగా ఉంటే చాలు ఆయన మెజారిటీకి ఢోకా ఉండదు. పైపెచ్చు వాజపేయి లాగా ఆయనకు ఎన్డీఏలో బలమైన మద్దతు ఉన్నది. అప్పుడు 29 సీట్లతో మెజారిటీ మిత్రపక్షంగా తెలుగుదేశం, ఆ తర్వాత 20 సీట్లతో జేడీ (యు), డీఎంకే వంటి ఇతర పార్టీలు మద్దతు నిచ్చినందువల్ల వాజపేయి అయిదేళ్లు తనదైన శైలిలో పాలనను నిర్వహించారు. ఇప్పుడు కూడా తెలుగుదేశం, జనతాదళ్ (యు)తో పాటు ఇతర పార్టీలు మోదీకి ఎన్నికల ముందే మద్దతు ప్రకటించి, బీజేపీతో పాటు మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. అంతేకాక, ఇండియా కూటమికి 232 సీట్లు లభించినప్పటికీ అది పలు పార్టీల సముదాయం. అది ఏ కోశానా ఈ అయిదేళ్లలో మోదీ ప్రభుత్వానికి ఢోకా కల్పించే అవకాశాలు లేవు. ఒకసారి 145, రెండోసారి 206 సీట్లు సాధించిన కాంగ్రెసే పదేళ్ల పరిపాలన నిర్వహించగలిగినప్పుడు 240 సీట్లు సాధించిన మోదీ ఎందుకు సమర్థంగా పరిపాలన నిర్వహించలేరు?

అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ మరో 30, 40 సీట్లను అదనంగా సాధించి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి. కాని ప్రజలు భిన్నంగా తీర్పునిచ్చారు. ప్రతిపక్షాలను బలంగా ఏకం చేయగలిగిన జయప్రకాశ్ నారాయణ్, సూర్జిత్ వంటి నేతలు లేనందువల్ల అది కలిసికట్టుగా పోటీ చేయలేకపోయింది. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించినప్పటికీ కాంగ్రెస్, ఇతర పక్షాలు సామాజిక సమీకరణలు తమకు అనుకూలంగా మారేందుకు గట్టిగానే కృషి చేశాయని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వందకు పైగా ఎంపీల్లో 37 మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు కావడం గమనార్హం. వీరిలో అత్యధికులు 50 శాతం పైగా ఓట్లను సాధించారు. ఆశ్చర్యకరమేమంటే 5 జనరల్ సీట్లలో ఈ వర్గాలు గెలిచాయి. క్రమంగా కాంగ్రెస్ తన మూలాల్లోకి ప్రవేశిస్తున్నదనడానికి ఇది ఉదాహరణ. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అయిదు సీట్లు సాధించిన సమాజ్‌వాదీ పార్టీ ఈ సారి 37 సీట్లు సాధించడానికి ప్రధాన కారణం పెద్ద సంఖ్యలో దళితులు కూడా బీఎస్‌పీని వదిలి ఎస్‌పీ వైపు మొగ్గుచూపడం. యూపీలో ఇండియా కూటమికి యాదవ, ముస్లిం ఓట్లు సంఘటితం కావడం మాత్రమే కాక దళితులు కూడా అధిక సంఖ్యలో మద్దతునీయడం బీజేపీ విస్మరించదగిన పరిణామం కాదు. బీజేపీ గతంలో 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధిస్తే ఈ సారి కేవలం 156 సీట్లలోనే 50 శాతం పైగా ఓట్లు సాధించడం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమే.



బిహార్‌లో నితీశ్, చిరాగ్ పశ్వాన్, జితన్ రాంమాంఝీ వంటి సామాజిక శక్తులు లేకపోతే ఇవాళ ఆ రాష్ట్రంలో ఎన్డీఏ మెజారిటీ సీట్లు సాధించగలిగేది కాదనేది స్పష్టం. బహుశా ఈ విషయం గమనించినందువల్లే మోదీ యూపీ, బిహార్‌కు కేంద్ర కేబినెట్‌లో అత్యధిక మంత్రి పదవులు కల్పించి ఉండవచ్చు.

అయితే కాంగ్రెస్ విజయంతో ఆ పార్టీ నేతలు ఉబ్బితబ్బిబ్బు కానక్కర్లేదు. 2019లో కంటే అది కేవలం రెండున్నరశాతం ఓట్లను అధికంగా సాధిస్తే, బీజేపీ ఒక శాతం కంటే తక్కువ ఓట్లను కోల్పోయింది. సామాజిక న్యాయ ఎజెండాతో ఎన్నికల్లో ప్రవేశించిన ఇండియా కూటమి ఈ ఎజెండాను అన్ని చోట్లా ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయినందువల్ల అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. తెలంగాణలాంటి చోట్ల బీజేపీ ఉధృతిని అరికట్టలేకపోయింది. దాదాపు 40 శాతం మేరకు దళితులు, ఆదివాసీలు ఉన్న ఒడిషాలో బిజూజనతాదళ్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆదరిస్తున్న విషయం తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర పోషించింది. 35 శాతం దళితులు, ఆదివాసీలు ఉన్న మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతున్నా, ఆపగలిగే నేతలు ఆ పార్టీలో లేరు. ఛింద్వారా వంటి కాంగ్రెస్ కంచుకోటలో కూడా బీజేపీ విజయం సాధించింది.

సామాజిక పరిస్థితులు పూర్తిగా పరిపక్వం కాకుండా సమాజంలో ఏ మార్పూ సంభవం కాదని. మార్పుకు దోహదం చేసే శక్తులు ఇంకా బలహీనంగా ఉన్నాయని ఈ ఎన్నికలు నిరూపించాయి. అందువల్లే బహుశా భారత ప్రజలు మోదీని పూర్తిగా తిరస్కరించాలని అనుకోలేదని రుజువయింది. మోదీ ఆకర్షణ, ఆయన భావజాలం, ఆయన హావభావాలు, విన్యాసాలు ఆయన పట్ల ప్రజల్లో పూర్తిగా వికర్షణ కల్పించలేకపోయాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆయనకు కూడా ఒక సందేశాన్ని ఇచ్చాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రజాస్వామిక పోరు పూర్తిగా మోదీ పేరుపైనే జరిగినందువల్ల ఎన్నికల ఫలితాలు కూడా ప్రజలు మోదీని దృష్టిలో ఉంచుకున్నవే అని చెప్పక తప్పదు. ఆ విషయం గ్రహించినందువల్లే మోదీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ పూర్తిగా మారిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడానికి బదులు నేరుగా ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి తన నివాసంలోనూ, సెంట్రల్ హాలులోను చంద్రబాబు పక్కన కూర్చుని చెణుకులు విసురుతూ, నవ్వుతూ వ్యవహరించిన తీరు, మిత్రపక్షాల పట్ల ప్రదర్శించిన స్నేహశీలత విస్మరించదగిన దృశ్యాలు కావు. ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

బీజేపీ ఎలా ఓడిపోయింది?

తీర్పు 2024 – 2



■ యోగేంద్ర యాదవ్

భారతీయ జనతా పార్టీ ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో, పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. పాలకపక్షాలుగా ఉన్న ప్రత్యర్థి పార్టీలను సవాల్ చేసిన రాష్ట్రాలలో గణనీయమైన లబ్ధి పొందింది. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.



ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పాలక పక్షం భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా అర్థం చేసుకోవడం సబబేనా? సబబేనని మాలో ఒకరు (యోగేంద్ర యాదవ్) గట్టిగా వాదించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు సమకూరింది. అయితే బీజేపీ తన మెజారిటీని కోల్పోవడమే కాదు, ప్రజామోదాన్ని పొందడంలో కూడా విఫలమయింది. ప్రత్యర్థి పక్షం ఏదీ తన దరి దాపుల్లోకి రాని రీతిలో ఏకైక పెద్ద పక్షంగా బీజేపీ ఆవిర్భవించింది. అయితే 400కి పైగా సీట్లను గెలవాలని, 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని స్వయంగా నిర్దేశించుకున్న లక్ష్యాల వెలుగులో బీజేపీ సంఖ్యా బలాన్ని పరిశీలించవలసి వున్నది. అంతకంటే ముఖ్యంగా ఎన్నికల ఫలితాలను వాటి రాజకీయ సందర్భంలో చూడవలసి ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికలలో ధన బలం, మీడియా మద్దతు, ప్రభుత్వ యంత్రాంగం, మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మొదలైనవన్నీ ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉన్నాయన్న కఠోర వాస్తవం నేపథ్యంలో బీజేపీ జయాపజయాలను అంచనా వేయవలసి ఉంది.

ఈ అవగాహనకు ఒక సంభావ్య వ్యతిరేక వాదన బీజేపీ ఓట్ల వాటా కథ. పాలక పక్షం ఓట్ల వాటా 37.4 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే పడిపోయింది. నిజానికి ఇది ఉపేక్షణీయమైనది. ఒడిషాలో బీజేపీ ఆశ్చర్యకరంగా జయపతాక నెగురవేసింది. కేరళలో పలు అవరోధాలను అధిగమించి తన ఉనికిని నెలకొల్పుకున్నది. ఆంధ్ర, పంజాబ్‌లలో తన ఉనికిని మెరుగుపరచుకున్నది. మొత్తం మీద దేశవ్యాప్తంగా తన ఉనికిని సుస్థిరపరచుకోవడంలో బీజేపీ పూర్తిగా సఫలమయింది అన్ని రాష్ట్రాలలోను రెండంకెల శాతంలో ఓట్ల వాటాను సాధించుకున్నది. ఈ వాస్తవాల ప్రాతిపదికన సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయం సాధంచిందని ఆ పార్టీ మద్దతుదారులు వాదిస్తున్నారు. స్వతంత్ర పరిశీలకులు వారితో ఏకీభవించడం లేదు.

రాష్ట్ర స్థాయి ఓట్ల వాటాలను నిశితంగా పరిశీలిస్తే పాలక పక్షాలు కొన్ని ప్రాంతాలలో ఓడిపోయి, మిగతా ప్రాంతాలలో లబ్ధి పొందిన కథ కాదని అర్థమవుతుంది. నిజానికి బీజేపీ పాలక పక్షంగా లేని ప్రతి చోటా ఓటర్లు అక్కడి పాలకపక్షానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో రెండు విభిన్న బీజేపీలు పోటీ చేశాయి. ఒకటి పాలకపక్ష బీజేపీ; రెండు ప్రతిపక్ష బీజేపీ. పాలకపక్ష బీజేపీ ఈ ఎన్నికలలో తీవ్రంగా నష్టపోగా సవాల్‌దార్ బీజేపీ గణనీయంగా లబ్ధి పొందింది. పాలకపక్షాలు, రాజకీయ ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా వేసిన ఓటుతో కొన్ని రాష్ట్రాలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అయితే బీజేపీకి దక్కిన ఈ లబ్ధి జాతీయ స్థాయిలో ప్రజా తీర్పు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉందన్న వాస్తవాన్ని పాక్షికంగా కప్పిపుచ్చింది దీని వల్ల బీజేపీ దీర్ఘకాలిక లబ్ధి పొందే అవకాశం లేదు.

దేశ వ్యాప్తంగా మూడింట రెండు వంతుల నియోజకవర్గాలలో (కచ్చితంగా చెప్పాలంటే 356 సీట్లు) బీజేపీ ప్రాబల్య రాజకీయ పక్షంగా ఉన్నది. రాష్ట్ర పాలక పక్షంగా లేని చోట్ల కూడా అది ఆధిపత్య పార్టీగా ఉన్నది. బీజేపీ ప్రాబల్య నియోజక వర్గాలు పశ్చిమాన మహారాష్ట్ర, గుజరాత్ నుంచి తూర్పున బిహార్, జార్ఖండ్ దాకా విస్తరించి వున్నాయి. బీజేపీ ప్రస్తుతం పాలకపక్షంగా లేని కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. ఈ రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. దాని రాజకీయ గుత్తాధిపత్యానికి తీవ్ర విఘాతమేర్పడింది. గత సార్వత్రిక ఎన్నికలలో గెలుచుకున్న 271 నియోజకవర్గాలలో 75ను ఈ సారి కోల్పోయింది అయితే మిగతా రాష్ట్రాలు, ప్రాంతాలలో (187 సీట్లు) బీజేపీ పాలక పక్షాల, రాజకీయ ఆధిపత్య వర్గాల వ్యతిరేక శక్తిగా ఎన్నికల గోదాలోకి దిగింది. అధికారంలో ఉన్న లేదా ప్రాబల్య రాజకీయ పక్షాలను సవాల్ చేసింది. ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రలో వైసీపీ, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బీజేపీ సవాల్ చేసింది. ఇలా ఆయా రాష్ట్రాలలోని పాలక పక్షాలను సవాల్ చేయడం ద్వారా బీజేపీ లబ్ధి పొందింది. ఈ 187 సీట్లలో గతంలో గెలుచుకున్న వాటి కంటే ఈ సారి 12 సీట్లను అదనంగా కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే బీజేపీకి 6 శాతం ఓట్లు పెరిగాయి. ఈ మొగ్గు జాతీయ స్థాయిలో ఓట్ల వాటా తగ్గుదలను 1 శాతం మేరకు నివారించింది.

బీజేపీ ఓట్ల వాటా పైకి కనిపించిన దాని కంటే అధ్వాన్నంగా ఉన్నది. 2019లోను, 2024లోను పోటీ చేసిన నియోజకవర్గాలు 399 ఉన్నాయి. వీటిలో 274 నియోజకవర్గాలలో ఓట్ల శాతం బాగా పడిపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, జార్ఖండ్, హర్యానా, హిమాచల్, పంజాబ్, జమ్ము-కశ్మీర్‌లలో బీజేపీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాలలోను ఆ పార్టీ ఓట్ల వాటా తగ్గిపోయింది. యూపీలో రెండు స్థానాలలో మినహా మిగతా నియోజకవర్గాలు అన్నిటిలోను బీజేపీ ఓట్ల వాటా గణనీయంగా తగ్గింది 20 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన స్థానాల సంఖ్య 151 నుంచి 77కి తగ్గిపోయింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగిన 215 స్థానాలలో బీజేపీకి పడిన ఓట్ల పెరుగుదలను చూద్దాం. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ నియోజకవర్గాలలో 90 శాతానికి పైగా కైవసం చేసుకున్నది. ఈ సారి బీజేపీ 153 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. 62 స్థానాలను కాంగ్రెస్‌కు కోల్పోయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఈ నియోజకవర్గాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు 5.5 శాతం పెరిగాయి. ఇది బీజేపీకి తీవ్ర పరాజయమని చెప్పక తప్పదు.

బీజేపీ పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో ఆ పార్టీ పోటీ చేసిన స్థానాలలో దానికి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం గణనీయమైన స్థాయిలో ఉన్నది. ఈ నెగెటివ్ ఓటు రాజస్థాన్‌లో 12 శాతం, హర్యానాలో 12 శాతం, హిమాచల్‌లో 13 శాతం మేరకు ఉన్నది. ఇదే రాష్ట్రాలలో బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందింది. అయితే ప్రస్తుత ఎన్నికలలో రాజస్థాన్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలలో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగిపోవడంతో ఆ పార్టీ గణనీయమైన సంఖ్యలో సీట్లను కోల్పోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తీవ్రంగా నష్టపోయింది ఈ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం (6.8శాతం), దాని ఇరుగు పొరుగు రాష్ట్రాలలో నమోదైన బీజేపీ వ్యతిరేక ఓటుతో ఇంచుమించు సమరీతిలో ఉండడం గమనార్హం. బీజేపీ వ్యతిరేక ఓటు బిహార్‌లో 6.9 శాతం మేరకు, జార్ఖండ్‌లో అది 7 శాతం మేరకు ఉన్నది.

బీజేపీ ఓట్ల వాటాలో స్వల్పస్థాయి తగ్గుదల కర్ణాటక, అస్సాం, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్నది. ఈ అన్ని రాష్ట్రాలలో (కర్ణాటక మినహా) పాలకపక్షం తన సీట్లను చాలావరకు కాపాడుకోగలిగింది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేక ఓటు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమైనప్పటికీ బీజేపీ చాలా సీట్లను కోల్పోయింది. పాలకపక్ష బీజేపీ నష్టపోని రాష్ట్రాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మాత్రమే. ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షం బలహీనంగా ఉండంతో బీజేపీ లబ్ధి పొందింది. బీజేపీ ఓట్లను కొల్లగొట్టడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమయింది.

బీజేపీ ప్రతిపక్ష పాత్ర నిర్వహించిన రాష్ట్రాలలో పాలకపక్షాల పట్ల వ్యతిరేకత జాతీయ పాలకపక్షానికి సానుకూలంగా పరిణమించింది. తెలంగాణలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతు కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను 15.7 శాతం మేరకు అదనంగా పెంచుకున్నది. ఒడిషాలో 7 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు ఆ రాష్ట్రంలో అధికార పీఠాన్ని కూడా కైవసం చేసుకుంది. కేరళలో 3 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో ఆ రాష్ట్రంలో తన మొదటి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్నది. తమిళనాడు, పంజాబ్‌లలో ఒక కీలక భాగస్వామ్య పక్షాన్ని కోల్పోయిన కారణంగా ఆ మాజీ మిత్రపక్షానికి అనుకూలంగా ఉండే సామాజికవర్గాల మద్దతును బీజేపీ కోల్పోయింది. ఆ రాష్ట్రాలలో గతంలో కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేసిన కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను మొత్తంగా పెంచుకున్నప్పటికీ విడివిడి నియోజకవర్గాలలో దాని ఓట్ల వాటా స్వల్పంగా తగ్గిపోయింది. ఈ ధోరణికి పశ్చిమ బెంగాల్ ఒక మినహాయింపుగా కనిపిస్తున్నది. ఈ రాష్ట్రంలో పాలక తృణమల్ కాంగ్రెస్‌ను బీజేపీ గట్టిగా ఎదుర్కొన్నది. అయితే ఓట్ల వాటాలో 1.3 శాతాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన పరాజయం నుంచి బీజేపీ ఇప్పటికీ కోలుకోలేదని ఆ ఓట్ల వాటా తగ్గుదల స్పష్టం చేసింది.

భారతీయ జనతా పార్టీ ప్రజామోదాన్ని పొందిందా అన్నది ఈ సార్వత్రిక ఎన్నికల అసలు ప్రశ్నగా చెప్పి తీరాలి. 400కు పైగా సీట్లను, 50 శాతానికి పైగా ఓట్లను గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని బీజేపీ తనకుతాను నిర్దేశించుకున్నది. ఆ రికార్డు స్థాయి సీట్లు, ఓట్లు సాధిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని ఆ పార్టీ పదేపదే వ్యక్తం చేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించక ముందే బీజేపీనే మళ్లీ విజేత అని సర్వత్రా భావించడం జరిగింది. ఆ పార్టీ శ్రేణులకైతే ఈ విషయంలో ఇసుమంత సందేహం కూడా లేదు. బీజేపీ ప్రత్యర్థి పక్షాల సంఖ్యా బలం గురించి ఎవరూ పట్టించుకోలేదు. బీజేపీ మిత్రపక్షాల సంఖ్యా బలంపై కూడా ఎవరూ శ్రద్ధ చూపలేదు మోదీ, ఆయన పార్టీ కేంద్రంగా జరిగిన అధికార క్రీడలో ఆ అంశాలన్నీ యాదృచ్ఛికమైనవేనని భావించడం జరిగింది.

బీజేపీ భవిష్యత్తుకు సంబంధించిన నిజమైన ప్రశ్న: పాలకపక్ష బీజేపీని ప్రతిపక్ష బీజేపీ ఎలా రక్షించగలుగుతుంది? బీజేపీ ఎదుగుదలకు ఆస్కారమున్న రాష్ట్రాలు ఇప్పుడు ఎన్నో లేవు. వివిధ రాష్ట్రాలలో పాలకపక్షాలను సవాల్ చేసిన రాజకీయ శక్తిగా బీజేపీకి సమకూరిన సానుకూలతలు సుదీర్ఘకాలం పాటు కొనసాగవు. ఇది స్పష్టం. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను పాలకపక్ష బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది రెండవది)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



వర్షాకాలం వేసుకునే రెయిన్ కోట్స్ ఆకర్షణీయమైన రంగుల్లో, అందమైన మోడళ్లలో తయారవుతున్నాయి. వేసుకునే దుస్తులకు తగ్గట్టు రకరకాల మోడల్స్‌లో దొరుకుతున్న రెయిన్ కోట్స్ మీద ఓ లుక్కేద్దామా?

పాంచో రెయిన్‌కోట్: ఈ రెయిన్‌కోట్ ప్లాస్టిక్‌తో తయారవుతుంది. తేలికగా ఉండే ఈ రెయిన్‌కోట్‌ను సునాయాసంగా మడత పెట్టేసి, వెంట తీసుకెళ్లిపోవచ్చు.

పాకెట్ రెయిన్‌కోట్: రెయిన్‌కోట్ కోసం ప్రత్యేకమైన సంచిని కేటాయించ లేనివాళ్లు, ఉపయోగించని సమయాల్లో దాన్ని భద్రంగా దాచాలనుకునేవాళ్లకు అనువైన రెయిన్ కోట్ ఇది. లైట్ వెయిట్, రీయూజబుల్ మెటీరియల్‌తో తయారయ్యే ఈ రెయిన్‌కోట్‌ను చిన్నపాటి పాచ్‌లో, లేదా జేబులో దాచేయవచ్చు.

వాటర్ ప్రూఫ్ రెయిన్‌కోట్: వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్, వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్ కంటే మంచివి. వాటర్ రిపెల్లెంట్ రెయిన్ కోట్స్ తయారీలో నీటిని అంటుకోనివ్వకుండా చేసే రసాయనాలను ఉపయోగిస్తారు. కాబట్టి వాటర్ ప్రూఫ్ తరహా రెయిన్‌కోట్స్‌నే ఎంచుకోవాలి.

సాధారణంగా రెయిన్ కోట్స్ పాలియెస్టర్, రెయాన్ మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. నైలాన్‌తో పోలిస్తే పాలియెస్టర్ మెటీరియల్ తడిని సమర్థంగా ఆపుతుంది. అలాగే రెయిన్‌కోట్స్ డిజైన్ ఆధారంగా వాటికి వేర్వేరు పేర్లు కూడా ఉన్నాయి.


లవ్లీ రెయిన్‌కోట్స్



"క్రీ.శ 1200వ శతాబ్దంలో అమేజాన్ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా రెయిన్‌కోట్స్‌ను ఉపయోగించిన చారిత్రక ఆధారాలున్నాయి. పాలను పోలిన జిగట పదార్థంతో (రబ్బర్ చెట్ల జిగురు) అప్పట్లో రెయిన్‌కోట్లను తయారుచేసేవారు. యూరోపియన్లు, అన్వేషకులు, అమెరికాస్‌కు ప్రయాణించినప్పుడు, వాన నీళ్లకు తడిచిపోకుండా కాపాడే ఈ రెయిన్‌కోట్లను వాళ్లు కనుగొన్నారు. అమేజాన్ ప్రాంత ప్రజలు రబ్బరు పాలతో రెయిన్‌కోట్లను తయారుచేసుకున్న విధానాన్ని, యూరోపియన్లు, 1700 శతాబ్దంలో కనిపెట్టగలిగారు. అలా అప్పటి నుంచి మెరుగైన రెయిన్‌కోట్ల తయారీ పరిశోధనలు మొదలయ్యాయి. 1824లో, స్కాట్‌ల్యాండ్ కెమిస్ట్, మొట్టమొదటి ఆధునిక రెయిన్‌కోట్‌ను తయారుచేశాడు. దాని తయారీకి ఉపయోగించిన టార్పాలిన్ వస్త్రాన్ని, ఇండియన్ రబ్బర్ క్లాత్ అని అతను సంబోధించేవాడు. అలా అప్పటి నుంచి రెయిన్‌కోట్లు ఎన్నో మార్పులకు గురవుతూ, ఫ్యాషన్ ప్రపంచంలో సైతం ఉనికిని చాటుకోగలిగే స్థాయికి ఎదిగాయి.

విన్నర్

మట్టి కోట మహారాణి



రికార్డులు బద్దలు కొట్టడం ఆమెకు కొత్త కాదు. పంథొమ్మిదేళ్ల వయసులోనే 'రొలాండ్ గారోస్'ను ముద్దాడింది. దిగ్గజాలు తలపడే గ్రాండ్‌స్లామ్‌ల్లో విజయాలూ తక్కువేం లేవు. నాలుగేళ్లలో ఐదు టైటిళ్లు సాధించింది. ఇప్పుడు... వరుసగా మూడోసారి 'ఫ్రెంచ్ ఓపెన్' నెగ్గి... మట్టి కోట మహారాణిగా పూలాభిషేకం అందుకొంటోంది. పోలెండ్ టెన్నిస్ సంచలనం... ప్రపంచ నెంబర్ వన్... 23 ఏళ్ల ఇగా స్వియాటెక్ జైత్రయాత్ర ఇది...

రాకెట్ పట్టి... టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టే ఎవరైనా కనే ఒకే ఒక్క కల... గ్రాండ్‌స్లామ్ టైటిల్. మహామహులు తలపడే ఈ మహాసంగ్రామంలో ప్రతి గెలుపు వెనుకా స్ఫూర్తి నింపే జీవిత కథలు ఎన్నో ఉంటాయి. అలుపెరుగని కృషి, పట్టుదల ఉంటాయి. అలాంటి ఒక కథే ఇగా స్వియాటెక్‌ది. పోలెండ్ దేశం వార్సాలో పుట్టింది. ఆమె తండ్రి టోమజ్ కూడా క్రీడాకారుడే. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో జాతీయ రోయింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తల్లి డొరోటా వైద్యురాలు. అక్క అగట డెంటిస్ట్. తన ఇద్దరు కూతుళ్లను క్రీడాకారులుగా చూడాలనేది టోమజ్ ఆకాంక్ష. దానికి తగినట్టుగానే అగట స్విమ్మింగ్ మొదలుపెట్టింది. కొన్ని కారణాలవల్ల కొన్నాళ్లకు టెన్నిస్‌ను ఎంచుకుంది. అక్కను చూసి స్వియాటెక్ టెన్నిస్ రాకెట్ పట్టుకుంది. ఎందుకంటే అక్కను ఓడించాలని. అయితే ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్ వరకు పోటీపడిన అగట... గాయాల కారణంగా పదిహేనేళ్ల వయసులో ఆట నుంచి తప్పుకుంది. కానీ స్వియాటెక్ మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టిన రాకెట్ వదల్లేదు. దృఢ సంకల్పంతో ముందుకు సాగింది. పదమూడేళ్లకే ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీకి వెళ్లి... కఠోర సాధన ప్రారంభించింది.

గెలుపు బాట...

2015 నుంచి ఐటీఎఫ్ జూనియర్ స్థాయిలో పోటీపడిన స్వియాటెక్... ఆ ఏడాది నాలుగు టైటిళ్లు గెలుచుకుంది. ఆ మరుసటి సంవత్సరం జూనియర్ గ్రాండ్‌స్లామ్‌లోకి అడుగుపెట్టి... 'ఫ్రెంచ్ ఓపెన్' డబుల్స్, సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ వరకు వెళ్లింది. 2018లో కాటీ మెక్‌నలీతో కలిసి 'ఫ్రెంచ్ ఓపెన్' బాలికల డబుల్స్ టైటిల్ సాధించిన స్వియాటెక్... అదే ఏడాది 'వింబుల్డన్' గర్ల్స్ సింగిల్స్ విజేతగా నిలిచింది. అప్పటికి ఆమె కెరీర్‌లో అతిపెద్ద విజయం అది. ఇక నాటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో 'డబ్ల్యూటీఏ' (ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్) టూర్‌లో పాల్గొంది. పద్ధెనిమిదేళ్ల వయసులో... గ్రాండ్‌స్లామ్స్‌లోకి ప్రవేశించింది. 'ఆస్ట్రేలియన్ ఓపెన్', 'ఫ్రెంచ్ ఓపెన్'లలో పోటీపడింది.

సంచలనాలకు చిరునామా...

సంచలనాలకు చిరునామా... స్వియాటెక్ కెరీర్. 2016 నుంచి 2018 వరకు రెండేళ్ల కాలంలో ఆడిన ఏడు ఐటీఎఫ్ సర్క్యూట్ ఫైనల్స్‌లో ఓటమి ఎరుగని క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒక టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె కొట్టిన క్రాస్ కోర్ట్ ఫోర్‌హ్యాండ్ డ్రాప్ షాట్... 'డబ్ల్యూటీఏ షాట్ ఆఫ్ ద ఇయర్' (2019)గా ఎంపికైంది. తొలిసారి 'టాప్ 100'లో చోటు సంపాదించింది. అయితే ఆ తరువాత జరిగిన 'వింబుల్డన్', 'యూఎస్ ఓపెన్', కెనడియన్ ఓపెన్'లలో వరుస ఓటములు ఎదురయ్యాయి. కానీ ఆమె నిరాశ చెందలేదు. రెట్టించిన ఉత్సాహంతో... మరింత కఠోర సాధనతో... తిరిగి పుంజుకుంది. తనకంటే మెరుగైన సీడ్స్‌ను మట్టి కరిపిస్తూ... ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో 'టాప్ 50'లోకి దూసుకుపోయింది. అదే సమయంలో కాలి గాయం ఆమెను కొన్నాళ్లు ఆటకు దూరం చేసింది.



హ్యాట్రిక్ కొట్టి...

పాదానికి శస్త్రచికిత్స తరువాత స్వియాటెక్ మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టింది. 54వ ర్యాంకర్‌గా 2020 'ఫ్రెంచ్ ఓపెన్' బరిలోకి దిగిన ఆమె... సంచలన విజయాలు నమోదు చేసింది. 2019 రన్నరప్, ప్రపంచ 19వ ర్యాంకర్ మార్కెటా వోండ్రొసోవాను తొలి రౌండ్‌లో ఇంటికి పంపించిన స్వియాటెక్... నాలుగో రౌండ్‌లో టాప్‌సీడ్, టైటిల్ ఫేవరెట్ సిమోనా హలెప్‌కు షాకిచ్చింది. తద్వారా సిమోనా 17 వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. అంతిమ పోరులో ప్రపంచ ఆరో ర్యాంకర్ సోఫియా కెనిన్‌ను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచిన పోలెండ్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అంతేకాదు... 'ఫ్రెంచ్ ఓపెన్' సింగిల్స్ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డును తిరగరాసింది. 2022 ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకం. ఆ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్) ఆమె ఖాతాలో చేరాయి. మరుసటి సంవత్సరం కూడా 'ఫ్రెంచ్ ఓపెన్' సొంతం చేసుకున్న స్వియాటెక్... ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకుంది. గతవారం ముగిసిన టోర్నీ ఫైనల్‌లో 6-2, 6-1తో పన్నెండో సీడ్ పౌలినీని చిత్తు చేసి, మట్టి కోటలో హ్యాట్రిక్ టైటిల్స్ సాధించింది. 'రొలాండ్ గారోస్'లో హెనిన్, మోనికా సెలెస్ తరువాత వరుసగా మూడు టైటిల్స్ గెలిచిన మూడో క్రీడాకారిణి స్వియాటెక్.

> **పుస్తకాలు అద్భుత నేస్తాలు...**
>
> నేను టెన్నిస్ కోర్టులో హోరాహోరీగా పోరాడతాను. దూకుడుగా ఆడతాను. ప్రతి పాయింట్‌నూ, దానికి ప్రేక్షకులు కొట్టే చప్పట్లను ఆస్వాదిస్తాను. కానీ కోర్టు బయటకు వెళితే నేను పూర్తి భిన్నమైన వ్యక్తిని. ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడతాను. రణగొణ ధ్వనులు, జనసమర్థమైన ప్రదేశాలు నచ్చవు. ఒంటరిగా కూర్చొని 'నేషనల్ జియోగ్రఫిక్' చానల్ చూస్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ఇవాళ ప్రతిఒక్కరూ సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడిపి, విలువైన సమయం వృథా చేస్తున్నారు. పుస్తక పఠనం మరిచిపోయారు. సామాజిక మాధ్యమాలే కాదు... ఖాళీ సమయంలో పుస్తకాలు కూడా అద్భుత నేస్తాలు.

అంచనాలు పెరుగుతున్నాయి...

ఇప్పటి వరకు మొత్తం 22 సింగిల్స్ టైటిల్స్ సాధించిన స్వియాటెక్‌పై అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 'గత ఏడాది దాదాపు ఆడిన అన్ని టోర్నీలు గెలవడంతో... ప్రతిసారీ అదే స్థాయిలో ఆడగలనని ప్రతిఒక్కరూ ఊహిస్తున్నారు. అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రొఫెషనల్ క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రతిభ గలవారే. అయితే ఎవరైతే ఒత్తిడి పరిస్థితులను తట్టుకొని మానసికంగా దృఢంగా ఉండగలరో వారే చాంపియన్లు అవుతారు' అంటున్న స్వియాటెక్ ఎక్కడికి వెళ్లినా ఒక స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను వెంట తీసుకువెళుతుంది. మానసిక ఆరోగ్యానికి ఆమె అంతగా ప్రాధాన్యతనిస్తుంది. 'కెరీర్ ఆరంభం రోజులతో పోలిస్తే నా జీవితం సమూలంగా మారిపోయింది. అయినా ఇవాల్టికీ నేను అదే మనిషిని. నాలో ఎలాంటి మార్పూ రాలేదు. కారణం... మానసిక పరివర్తన. చిన్నప్పటి నుంచి నాతో సైకాలజిస్ట్ ఉంటున్నారు. తను నా క్లిష్ట పరిస్థితులు, అలాగే గెలుపు క్షణాలు దగ్గర నుంచి గమనిస్తుంటుంది. నాకేంకావాలో చెబుతుంది' అంటున్న ఈ పోలెండ్ స్టార్... అపజయాన్నే కాదు, విజయాన్ని ఎదుర్కోవడం కూడా అంత సులువు కాదని చెబుతోంది. ఎంత ఎదిగినా... ఇంటికి ఎన్ని గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు తీసుకెళ్లినా... స్వియాటెక్‌లో ఇసుమంతైనా గర్వం కనిపించదు. అదే ఆమె ప్రత్యేకత.

ఆటకు ముందు సంగీతం...

మ్యాచ్‌కు ముందు ఇంపైన సంగీతం ఆస్వాదించడం స్వియాటెక్‌కు అలవాటు మాత్రమే కాదు... సెంటిమెంట్ కూడా. "గన్స్ ఎన్ రోజెస్, లెడ్ జెప్పెలిన్, జానిస్ జోప్లిన్, లెన్నీ క్రావిట్జ్ సంగీతం తరచూ వింటుంటాను. మొదట్లో మ్యాచ్‌లకు ముందు 'వెల్కమ్ టూ జంగిల్' పాప్ సాంగ్స్ వినేదాన్ని. ఎప్పుడూ ఒకే సంగీతం కాకుండా... ఎప్పటికప్పుడు మారుస్తుంటాను. లేకపోతే అది ఒక మూఢనమ్మకంలా మారిపోతుంది" అంటుంది స్వియాటెక్.

చాలామంది జీవితంలో చిన్న పరీక్షలు, ఇబ్బందులు వచ్చినా ఇట్టే డీలా పడిపోతారు. కొందరు మాత్రం ఎన్ని సమస్యలొచ్చినా ముందుకే అడుగులేస్తారు. అలాంటి కోవలోకే అంచల్ భటేజా చెందుతుంది. పదో తరగతి పరీక్షల ముందు కంటిచూపు కోల్పోయిన అంచల్ ఆ తర్వాత అచంచలమైన విశ్వాసంతో లాయరైంది. ఆమె ప్రస్థానమిదే..

స్ఫూర్తిదాయకం.. అంచల్ కథ



ఈ ప్రపంచాన్ని చూడటానికి కళ్లు కావాలి. కళ్లు లేకపోతే ప్రపంచమే లేదు. అంచల్ భటేజాకు కళ్ల జబ్బు ఉందని.. ఎప్పుడైనా కళ్లు కనిపించకుండా పోవచ్చనే విషయం తల్లిదండ్రులకు ముందే తెలుసు. కానీ మంచి ఆహారం.. మందులు- ఇలా వీలైనన్ని శ్రద్ధలు తీసుకున్నారు. కానీ 10వ తరగతికి వచ్చేసరికి- అంచల్‌కు దృష్టి మందగించటం మొదలైంది. డాక్టర్ దగ్గరకు వెళ్తే చూపు కోల్పోయే సమయం వచ్చిందని చెప్పారు. 10వ తరగతి పరీక్షల ముందు అంచల్‌కు చూపు పూర్తిగా పోయింది. దానితో తన తరఫున పరీక్షలు రాయటానికి సహాయకులను పెట్టుకొని పదో తరగతి పాస్ అయింది. కాలేజీలో కూడా చేరింది. అంచల్‌కు అసలైన సవాలు అప్పుడు ఎదురయింది. సాధారణంగా విన్న విషయాల కన్నా చదివిన విషయాలను మన మెదడు గుర్తుపెట్టుకుంటుంది. అయితే చూపు లేనివారిలో గ్రహణ శక్తి బాగా పెరుగుతుంది. అంచల్ ఇలా తన సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకుంది. చూపు లేని వారి కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో తయారుచేసిన పుస్తకాలు చదవటం ప్రారంభించింది. ప్రత్యేకమైన రీడింగ్ టూల్స్‌ను నేర్చుకొని ప్రాక్టీసు చేయటం మొదలుపెట్టింది. అందరూ అంచల్ ఏకాగ్రతను చూసి ఆశ్చర్యపోయేవారు. కళ్లు లేవు కాబట్టి పరీక్షలు రాయటానికి ఒక సహాయకుడిని ఇచ్చేవారు. అంచల్ వారి ద్వారా పరీక్షలు రాసేది. ఎంత ఏకాగ్రతతో పరీక్షలు రాసేదంటే- మిగిలిన వారి కన్నా ఆమె అరగంట ముందే సమాధానాలు రాసేది. ఇలాగే పోటీ పరీక్షలు కూడా రాయటం ప్రారంభించింది. కానీ ఆమెకు టెక్నాలజీని ఉపయోగించుకోవటం ద్వారా మరిన్ని మంచి ఫలితాలు ఉంటాయనిపించింది. దీనితో అంధుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన లాప్‌టాప్‌ను ఉపయోగించటం ప్రారంభించింది. ఈ సమయంలోనే అంచల్- కామన్ లా అడ్మిషన్ టెస్ట్(సీలాట్)ను రాసి బెంగుళూరులోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ)లో సీటు సంపాదించింది. ఈ యూనివర్సిటీలో సీటు సంపాదించిన తొలి అంధ విద్యార్థి అంచల్ కావటం ఒక విశేషం!

అదే ప్రారంభం...

లా కాలేజీలో సీటు సంపాదించటంతో అంచల్ ఆగిపోలేదు. ఆమె కథ అక్కడే మొదలయింది. లా చదువుతున్న సమయంలో తొలి ఏడాదే లాప్‌టాప్‌లో పరీక్షలు రాయటం ప్రారంభించింది. సాధారణంగా అంధ విద్యార్థులకు పరీక్షలు రాయటానికి ఒక అరగంట సమయం ఎక్కువగా ఇస్తారు. "కానీ నాకు ఎప్పుడూ ఆ అవసరం రాలేదు. మిగిలిన వారి కన్నా తక్కువ సమయంలోనే పరీక్షలు రాసేదాన్ని. లాప్‌టాప్‌ను సమర్థంగా వినియోగించుకోవటం వల్ల సమయం కలిసివచ్చేది" అంటారు అంచల్. చదువు పూర్తి కాగానే ఆమె ప్రస్తుత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ దగ్గర ఇంటర్న్ చేరింది. "నా ఇంటర్న్‌షిప్ పూర్తయిన వెంటనే చంద్రచూడ్ నాకో ఉత్తరం రాశారు. ఒక ఇంటర్న్‌గా నేను బ్రీఫ్‌లు రాయాల్సి ఉంటుంది. నేను తయారుచేసిన అలాంటి బ్రీఫ్‌లలో తనకు ఎటువంటి సమస్యలు రాలేదని ఆయన పేర్కొన్నారు.. నాకు అంత కన్నా పెద్ద ప్రశంస ఏముంటుంది" అంటారు అంచల్. ఇంటర్న్‌షిప్ తర్వాత అంచల్‌కు దేశంలోనే అత్యున్నత లా సంస్థలో ఉద్యోగమొచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత డిజిటల్ ప్రపంచంలో లభించే సమాచారం అంధులకు అందుబాటులో లేదనే విషయం అర్థమయింది. "ప్రతి రోజు కోర్టుకు అనేక పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వీటి కోసం చాలా పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఆ సమాచారమంతా డిజిటల్ ప్రపంచంలో ఉంటుంది. దానిని సేకరించాలంటే మొదట్లో చాలా కష్టంగా ఉండేది. ఎందుకంటే- చాలా వెబ్‌సైట్లు అంధులకు సహకరించే విధంగా ఉండవు..అందువల్ల మొదట్లో నేను ఇతరుల సాయం తీసుకొనేదాన్ని. ఆ తర్వాత నాకు ఆ అవసరం లేకుండా అయిపోయింది" అంటారు అంచల్. దీని కోసం తాను పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆమె గుర్తించింది. దీని కోసం ఆమె తన ప్రయత్నాలు ప్రారంభించింది. అంచల్ కథ- జీవితంలో ఎదురయ్యే కఠిన పరిస్థితులను తట్టుకొని కూడా ఎలా నిలబడవచ్చనటానికి ఒక పెద్ద ఉదాహరణ. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా అనేక మంది అంచల్‌లు ఉన్నారు. వారికి కొద్ది ఊతం ఇస్తే చాలు. తిరుగులేని శక్తిగా ఎదుగుతారు.



వ్యాధి నిరోధక శక్తినిచ్చే...



- విటమిన్లు, మినరల్స్ సపోటాలో పుష్కలం. ఓ రెండు సపోటాలు తింటే జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. దీనివల్ల పొట్ట సమస్యలు దరిచేరవు.
- ఈ పండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు పొటాషియం ఉండటం వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. గుండె సంబంధిత ఇబ్బందులు రాకుండా కాపాడుతుంది.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎ-విటమిన్ వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయిన వెంటనే కొత్త కణాలు వస్తాయి.
- వంద గ్రాముల సపోటాలను తింటే అందులో 83 కేలరీలు అందుతాయి. ఇందువల్ల కడుపు నిండినట్టు ఉంటుంది. అనారోగ్యానికి గురిచేసే ఇతర ఆహారాన్ని తినాలనుకోరు. అందుకే బరువు తగ్గాలనుకునేవాళ్లకు సపోటా సపోర్టుగా పని చేస్తుంది. వారి మెనూలో సపోటాను చేర్చుకోవాల్సిందే.
- కాల్షియం, పాస్ఫరస్ వల్ల ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంతేనా జుట్టు ఆరోగ్యానికి మంచిది.
- ఇందులో చక్కెరశాతం ఉండటం వల్ల త్వరగా శక్తి వస్తుంది. ఈ చక్కెర శరీరానికి ఎలాంటి హాని చేయదు. ఇకపోతే ఎ, సి విటమిన్స్ వల్ల తెల్లరక్తకణాల వృద్ధికి దోహదపడతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- సపోటాలు తినటం వల్ల నిద్ర పడుతుంది. మెదడు మీద ప్రభావం చూపడటం వల్లనే నిద్రవస్తుంది. దీనివల్ల ఒత్తిడి తగ్గిపోతుంది.
- డయాబెటిక్ బారిన పడినవాళ్లు ఈ సపోటాను ఎంచక్కా తినొచ్చు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed at Aamoda Press, Andhra Jyothi Buildings, Industrial Development Area, UTPL Compound, Block - A, Mindi Village, Gajuwaka Mandal, Visakhapatnam 530 012, Andhra Pradesh and Published at Andhra Jyothi Buildings, P B No: 424, N H - 5, Opp. Port Hospital, Akkayyapalem, Visakhapatnam 530 016, Andhra Pradesh. Editor : K. Srinivas, Phone No:2516923, Fax No:2795266, Regd.No: H/VM/103, RNI No:52780/1991 Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద కురుస్తున్న వర్షం

కృష్ణాదేవిపేటలో భారీ వర్షం

కృష్ణాదేవిపేట, జూన్ 11: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఉదయం నుంచి తీవ్రమైౖన ఎండతో అల్లాడిన ప్రజలకు సాంత్వన చేకూరింది. ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో వర్షం నీరు బయటకు పోయేందుకు మార్గం లేక కాలువల్లో కలిసి మురుగుతో సహా రహదారులపై ప్రవహించింది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కాగా భారీ వర్షం కురియడంతో ఖరీఫ్ సాగుకు దోహదపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈఏపీసెట్‌లో నర్సీపట్నం విద్యార్థుల ప్రతిభ

నర్సీపట్నం, జూన్ 11: ఈఏపీసెట్-2024 ఫలితాల్లో నర్సీపట్నం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రగతి కళాశాలకు చెందిన ఎస్.సరిష్మా 2,247 ర్యాంకు, వి.సరోన్‌శాంతికుమారి 2,985 ర్యాంకు, కె.పావని 3,259 ర్యాంకు, సిహెచ్.కోటిలోకేజ 6,475 ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యు.సత్తిబాబు, ప్రిన్సిపాల్ ఎ.బాబ్జి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



ఎస్.సరిష్మా

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

నర్సీపట్నం అర్బన్, జూన్ 11: రైతులు వరి విత్తనాల కోసం రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు ఆన్‌లైన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి డి.అప్పారావు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు 750 టన్నుల వరి విత్తనాలు అవసరమన్నారు. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కేటాయించినట్టు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకాలతో రైతుభరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

మాకవరపాలెం: మండలంలో ఖరీఫ్ సాగుకు వరి విత్తనాల కోసం రైతులు స్థానిక ఆర్బీకేలోంల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి చిరంజీవి తెలిపారు. ఆర్బీకేల్లో రైతులకు కావాలిసన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఆర్‌జీఎల్, 1061, 1064, ఎంటీయూ-1318, సాంభమసూరి, సోనామసూరి తదితర రకాలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

ఎరకంపేటలో పశువుల పాకకు నిప్పు



ప్రమాదంలో కాలిపోతున్న పశువుల పాక, గడ్డి వాము

గొలుగొండ, జూన్ 11: మండలంలోని చీడిగుమ్మల పంచాయతీ శివారు ఎరకంపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి పశువుల పాక, గడ్డి వాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పనులు ముగించుకుని రైతులు ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే మంటలు చెలరేగుతుండడాన్ని గుర్తించిన గ్రామస్థులు హుటాహుటిన వెళ్లి అదుపు చేసేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. పట్నాల సన్నిబాబు, గజ్జి రాజబాబుకు చెందిన పశువుల పాక, గడ్డి వాము కాలి బూడిదైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పినకోటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి, జూన్ 11: మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జూన్ నుంచి అక్టోబరు వరకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ కుట్టరాదు, దోమ పుట్టరాదు అంటూ నినాదాలు చేశారు. నీరు నిల్వ లేకుండా పరిసర పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని కోరారు. వైద్యాధికారి జి.వెంకటేష్, సబ్ యూనిట్ అధికారి బి.బాబూరావు, పర్యవేక్షకురాలు సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ: గ్రామాల్లో మలేరియా వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి తరణి కోరారు. మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో ఈ మేరకు రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 52 మందికి తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం ఆశవర్కర్‌లు సేవలు అందించారు.

విస్తరణ ఒట్టిమాటే!

... 1వ పేజీ తరువాయి

చేస్తామని, వాహనాలు మలుపు తిరిగే సమయంలో ఎటు వంటి ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు అవసరమైన అంచనాలు తయారుచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు అప్పట్లోనే సూచించారు. ప్రస్తుతం ఈ జంక్షన్‌లో ఇరుకుమయంగా మారింది. విస్తరణ చేపడితే సమస్యలు తొలగిపోతాయని పట్టణ వాసులు భావిస్తున్నారు.

హత్యకు పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖపట్నం (లీగల్), జూన్ 11: హత్యా నేరానికి పాల్పడిన ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు పైలా రమణ అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శంబంగి గ్రామానికి చెందినవాడు. ఇదే గ్రామానికి చెందిన సర్ల వెంకటరమణతో పైలా రమణకు భూ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో 2014 అక్టోబరు 14న వీరిరువూ ఘర్షణకు దిగడంతో సుర్ల వెంకటరమణ తల, ముఖంపై పైలా రమణ ఇటుక, బండరాయితో కొట్టాడు. దీంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. నాతవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ఇదెక్కడి చోద్యం!

- మాడుగుల ఆస్పత్రిలో నెల తర్వాత నర్సుల దినోత్సవం
- డీసీహెచ్ఎస్ సమయంలో వేడుకలు
- ఆస్పత్రిలోనే విందు భోజనాలు
- రోగులకు వైద్యం అందించాల్సిన సమయంలో హడావుడి

మాడుగుల, జూన్ 11 : మాడుగుల సీహెచ్‌సీలో ఎప్పుడో జరిగిపోయిన నర్సుల డేను మంగళవారం అనకాపల్లి జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు (డీసీహెచ్ఎస్) సమక్షంలో నర్సులు, వైద్యులు, సిబ్బంది ఎంతో అట్టహాసంగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. రోగుల ఇబ్బందులను పక్కన పెట్టి ఈ వేడుకలను నిర్వహించడం విశేషం. మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం కాగా, నెల తర్వాత ఈ సంబరాలు జరిపారు. ఆస్పత్రి వార్డులో ఇన్‌పేషెంట్లు ఉన్నా, ఓ వార్డును ఖాళీ చేయించి ఈ వేడుకలు కొనసాగించారు. కేరింతలు, కేక్‌లు కట్ చేసి విందు భోజనాలు చేశారు. కాగా ఈ సంబరాలకు డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావుని కూడా ఆహ్వానించి ఆయనతోపాటు ఆస్పత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్‌లకు సన్మానం చేశారు. రోగులకు వైద్యం అందించాల్సిన మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వారు సంబరాల్లో మునిగిపోయారు. రోగులు ఇబ్బంది ఎదుర్కొన్నా బయటకు చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వచ్చి చేసేదిలేక తిరుగుముఖం పట్టారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న 'ఆంధ్రజ్యోతి' పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో డీసీహెచ్ఎస్, వైద్యులు, హెచ్ఎన్ మరికొంతమంది ఆస్పత్రి ఓ గదిలో విందు భోజనాలు చేస్తున్నారు. వెలుపల రోగులను ఖాళీ చేయించిన హాల్‌లో నర్సులు వేడుకల్లో కనిపించారు. దీనిపై సూపరిండెంట్ చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా, రోగులకు ఇబ్బంది లేకుండా నర్సులడే వేడుకలు చేసుకుంటే తప్పేముందంటూ సమాధానమిచ్చారు. డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావుని అడుగగా, తనిఖీల్లో భాగంగా వచ్చానన్నారు. రికార్డులు పరిశీలించినట్టు బదులిస్తూ మాట దాటవేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలువురు రోగులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మాడుగుల ఆసుపత్రిలో నర్సుల డే సందర్భంగా భోజనాలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీలు



బంగారుమెట్టలో అలంకారప్రాయంగా మిగిలిన చెత్త సంపద కేంద్రం



బుచ్చెయ్యపేట పీఏసీఎస్ సమీపంలో వేసిన కాలువ చెత్త

రూ.లక్షల వ్యయం.. లక్ష్యం నిర్వీర్యం

- గ్రామాల్లో వృథాగా సంపద కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- రోడ్లు, కాలువు, చెరువుల పక్కన చెత్త డంపింగ్

బుచ్చెయ్యపేట, జూన్ 11: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మిగిలాయి. మండలంలో 35 గ్రామపంచాయతీల్లో 24 వాటిల్లో ఈ కేంద్రాలను నిర్మించారు. స్థల సమస్యతో ఐతంపూడి, దిబ్బిడి, గంటికొర్లాం, కొండెంపూడి ఎల్. సింగవరం, ఎల్‌బీపీ. అగ్రహారం, మంగళాపురం, పెదపూడి, సీతయ్యపేట గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించలేదు. కొండపాలెం, కోమళ్లపూడిలో కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వడ్డాది, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, పి.భీమవరం, చినఅప్పన్నపాలెం, కందిపూడి, పొ లేపల్లి, రాజాం, ఆర్.భీమవరం, ఆర్.శివరామపురం, నీలకంఠాపురం, మల్లాం, లైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, కరక, గున్నెంపూడి, పెదమదీన, చింతపాక, పీపీ. అగ్రహారం గ్రామాల్లో సుమారు రూ. కోటితో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. వీధుల్లో సేకరించిన చెత్తను ఊర్ల శివారు రోడ్డపక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. వడ్డాదిలో సేకరించిన చెత్తను కస్పా కాలువ గట్టుపైన, బుచ్చెయ్యపేటలో సేకరించిన చెత్తను చెరువు, కాలువ పక్కన, బంగారుమెట్టలో చెత్తను ఎస్సీ కాలనీ సమీపంలో పడేస్తున్నారు. ఇతర గ్రామాల్లో ఇదే మాదిరిగా వేయడంతో పారిశుధ్య సమస్యలతోపాటు పరిసరాలు దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో రోజువారీ వచ్చే చెత్తను సేకరించి ఆ కేంద్రాలకు తరలించాలన్న లక్ష్యం కాగితాలకే పరిమితంగా మారింది. ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని వృద్ధి చేసేందుకు, ఓడీఎస్ గ్రామాలుగా తీర్చిదిద్ది ప్రభుత్వపరంగా ప్రోత్సహించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. చెత్తసంపద తయారీ కేంద్రాల్లో ఎరువు తయారు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు వృథాగా వదిలేయడంపై విమర్శలు నెలకొంటున్నాయి. అలంకారప్రాయంగా మిగిలిన చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

చీడికాడ, జూన్ 11: వ్యాధుల నివారణకు ఆశవర్కర్‌లు చర్యలు తీసుకోవాలని పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి కిలపర్తి ఉషాచైతన్య కోరారు. ఆస్పత్రి ఆవరణలో ఆశవర్కర్‌లతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పరిసరాలను, వాటర్‌ట్యాంకుల ఎప్పటికప్పుడు శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై జనాలకు ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. గర్భిణులను ఉచిత స్కానింగ్‌కి తీసుకువెళ్లి వైద్యసాయమందించాలని కోరారు. టీకాలు సక్రమంగా వేయించాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌వీ శకుంతల, స్టాఫ్ నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెదగోగాడ వైద్యాధికారి ఉషాచైతన్య

ఘనంగా మోదకొండమ్మతల్లి జాతర



టి. అర్జాపురంలో అమ్మవారి పూజల్లో భక్తులు



ఘటాల ఊరేగింపులో మహిళలు



సన్యాసమ్మకు మొక్కులు తీర్చుతున్న గ్రామస్థులు

రావికమతం, జూన్ 11: టి. అర్జాపురం, చిలకవానిపాలెంతో పాటు ఆరు ఆదివాసీ గ్రామాల భక్తులకు ఆరాధ్యదైవంగా కొలిచే గదబపాలెం మోదకొండమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వేకువజాము నుంచి బారులు తీరారు. ఉత్సవ కమిటీ చైర్మన్ (టి.అర్జాపురం సర్పంచ్) మడగల ఫాల్గుణ ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. కేఎస్ఎన్ రాజు ఎమ్మెల్యేగా గెలుపొందాలని ప్రార్థించిన సర్పంచ్ అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు, మాలాధారణ చేసిన భక్తులు ఘటాలతో ఊరేగి అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా మంగళవారం రాత్రి భారీ బాణసంచా, విద్యుత్ సెట్టింగ్‌లుతోపాటు పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన చేపట్టారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

దేవరాపల్లి: మండల కేంద్రంలో సన్యాసమ్మ, రెల్లిపేట వద్ద ఉన్న పోలమాంబ గ్రామ దేవతల పండగలు మంగళవారం ఘనంగా జరిగాయి. సన్యాసమ్మ ఆలయం వద్ద కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బం డారు సత్యనారాయణమూర్తి విజయం సాధించిన సందర్భంగా హనుమాన్ యూత్, లవ్‌లీయూత్ ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. అలాగే, రెల్లిపేట వద్ద పండ్ల సీజన్ అనంతరం జరుపుకొనే పోలమాంబ పండగను జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు మొల్లి. కృష్ణమూర్తి, మురళి, మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమాత్యులెవరో?

... 1వ పేజీ తరువాయి

ఒకరికే అవకాశం ఉంటుందని విశ్వసనీయ సమాచారం. అయ్యన్నపాత్రుడు పార్టీలో సీనియర్. వైసీపీ ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొన్నారు. కేసులు నమోదయ్యాయి. కోర్టుల ద్వారా రక్షణ పొందారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఉత్తరాంధ్రలో ఇదే సామాజిక వర్గం నుంచి ఇద్దరు సీనియర్లు ఉన్నారు. ఒకరు అయ్యన్నపాత్రుడు కాగా మరొకరు అచ్చెన్నాయుడు. ఉత్తరాంధ్రలో ఈ సామాజిక వర్గానికి ఒకటే మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతోంది. అక్కడ అచ్చెన్నాయుడుకు పదవి దక్కితే ఇక్కడ అయ్యన్నకు అవకాశం ఉండదనే వాదన వినిపిస్తోంది. రెండోవారు పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు. పోలీసుల వేధింపులు ఎదుర్కొన్నారు. మహిళ, ఎస్సీ కోటాలో ఈసారి ఆమెకు పదవి గ్యారంటీ అనే మాట వినిపిస్తోంది.

జనసేన నుంచి...

ఉత్తరాంధ్రాలో జనసేన పార్టీ నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నిమ్మక జయరాజు (ఎస్‌టీ), విజయనగరం జిల్లా నెల్లిమర్ల నుంచి లోకం మాధవి, విశాఖ జిల్లా దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ, పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజకుమార్ గెలిచారు. ఉత్తరాంధ్ర నుంచి ఒకరికి మంత్రి పదవి ఇస్తారని అంటున్నారు. వీరిలో కొణతాల రామకృష్ణ సీనియర్. ఆయన కాంగ్రెస్ పార్టీలో వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా చేశారు. ఆ తరువాత పంచకర్ల రమేశ్‌బాబు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాపు సామాజికవర్గం. మిగిలిన వారంతా తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైనవారు. ఈసారి యువతకు, కొత్తవారికి అవకాశం ఇస్తారని అంటున్నారు. అదే నిజమైతే విశాఖ నుంచి పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా నుంచి అనితకు పదవులు ఖాయంగా కనిపిస్తోంది.

విద్యుత్ సమస్యపై రైతుల ఆందోళన

- త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వాలని నినాదాలు



సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన రైతులు, మిల్లర్లు

గొలుగొండ, జూన్ 11: మండల కేంద్రంలో త్రీ ఫేస్ విద్యుత్ లేకపోవడంపై మిల్లర్లు, రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధాన్యం పట్టుకుని వచ్చి రైతులు, మిల్లు యజమానులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొలుగొండ నుంచి కృష్ణాదేవిపేట ఫీడర్‌లో ఇరవై రోజులుగా త్రీఫేస్ విద్యుత్ లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి ధాన్యం ఆడేందుకుమిల్లుకు తీసుకు వచ్చామన్నారు. వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రస్తుతం ఏడు గంటల త్రీ ఫేస్ విద్యుత్‌ను ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సరఫరా చేయాల్సి ఉందని రైతులు, మిల్లర్లు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా వారు విజ్ఞప్తి చేశారు.

12న నల్లగొండమ్మ ఆలయ వార్షికోత్సవం

నాతవరం, జూన్ 11: మండల కేంద్రంలో నల్లగొండమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు.

15న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

చీడికాడ, జూన్ 11: మంచాల మోడల్‌స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో ఖాళీల భర్తీకి ఈనెల 15వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది ఆయా తరగతుల్లో చేరే విద్యార్థులు ఈనెల 14వ తేది సాయంత్రంలోగా దరఖాస్తులను పాఠశాలకు అందించాలన్నారు. శనివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకూ నిర్వహించనున్న పరీక్షకు హాజరుకావాలని కోరారు. వివరాలకు ప్రిన్సిపాల్ ఫోన్: 73864 92812 లేదా రికార్డు అసిస్టెంట్ ఫోన్: 81793 84669లను సంప్రదించాలని ఆమె కోరారు.

గ్రామాల్లో టీడీపీ విజయోత్సవాలు



అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న నాయకులు, గ్రామస్థులు

గొలుగొండ, జూన్ 10: తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో పలు గ్రామాల్లో నాయకులు విజయోత్సవాలు జరుపుకుంటున్నారు. మండలంలోని సాలికమల్లవరం, జమ్మదేవిపేట, పాకలపాడు, కరక గ్రామాల్లో గల గంగాదేవి, తలుపులమ్మ ఆలయాల వద్ద మంగళవారం నాయకులు, కార్యకర్తలు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లాన కొండలరావు, పెదిరెడ్ల నాయకులు మల్లేశ్వరరావు, ఇందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతు దిగాలు

- రైతుబజారులో గిట్టుబాటుకాని ధర



సంతపాలెం రైతుబజారులో మామిడి విక్రయాలు

కె.కోటపాడు, జూన్ 11: స్థానిక కె. సంతపాలెం రైతుబజార్‌లో మామిడి పండ్లకు ధర రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ రైతుబజారులో ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు కూరగాయలు, మామిడిపండ్లు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం సీజన్ వల్ల పరిసర గ్రామాల నుంచే కాకుండా దేవరాపల్లి, చోడవరం, కొత్తవలస మండలాల నుంచి కూడారైతుబజార్‌కు మామిడి దిగుమతి అవుతుంది. ఇక్కడి రైతుల వద్దనుంచి మామిడిపండ్లు కొనుగోలు చేసి విశాఖ, గాజువాక పరిసర సిటీ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఈ ఏడాది సరిగా వర్షాలు కురవకపోవడం వల్ల మామిడి పంట దిగుబడి తక్కువగా వచ్చింది. దీంతో సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ఒక క్రేటు మామిడి పండ్ల ధర రూ. 1400 నుంచి రూ. 1600లకు రావాల్సి ఉండగా, కేవలం వెయ్యి నుంచి రూ. 1200 మాత్రమే వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

ధర లేదు : -భూపతి అప్పారావు, రైతు, గుల్లేపల్లి



ఈ ఏడాది సరైన సమయాల్లో వర్షాలు కురవకపోవడం వల్ల మా మిడి పంట దిగుబడి తగ్గింది. ఉన్న పంటకు అయినా సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. తాము పెట్టిన పెట్టుబడి డబ్బు కూడా రావడం లేదు. సీజన్ చివరి అయిన కూడా క్రేటు మామిడి పండ్ల రేటు రూ. వెయ్యి నుంచి రూ. 1200లు మాత్రమే లభిస్తోంది. ఈ ధర రైతుకి సరైన లాభించడం లేదు.

వరి విత్తనాల పంపిణీ

దేవరాపల్లి, జూన్ 11 స్థానిక రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలను సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యులు కృష్ణమూర్తి మంగళవారం పంపిణీ చేశారు. ఆర్.జె.ఎల్ 66 క్వింటాళ్లు, ఎంటీయూ 1121, 36 క్వింటాళ్లు అమర్ 16 క్వింటాళ్లు ఉన్నట్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సత్యారావు, భాగ్యశ్రీ, ఈశ్వరరావు, మురళిబంధం పాల్గొన్నారు.

ర్యాంకుల పంట

... 1వ పేజీ తరువాయి

డి.సూర్యచంద్ర 49, జి.రియాజ్ 55, వై.శశికృతి 60, టి.సుహిత్ర 86, జి.జైకిషోర్ 89, బి.జయదీప్ 99వ ర్యాంకు సాధించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ స్ట్రీమ్‌లలో పాతిక మంది చొప్పున 100లోపు ర్యాంకు సాధించారు. నగరంలోని శ్రీచైతన్య, నారాయణ, శ్రీవిశ్వ, అసెంట్, ఆకాష్ తదితర కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులు ఎక్కువగా 1000లోపు ర్యాంకులు ఎక్కువగా సాధించారు. ఏపీఈఏపీసెట్‌లో టాప్ ర్యాంకర్లంతా దాదాపు ఐఐటీ/ఎన్ఐటీలలో ప్రవేశాలను అనువుగా ర్యాంకులు సాధించినవారే.

జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మశీలో కె.కుశాల్ ఒకటో ర్యాంకు (రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంకు), సీహెచ్.ధనుంజయ రెండోర్యాంకు (193వ ర్యాంకు), కె. సాయిచంద్రకిరణ్‌నాయుడు మూడో ర్యాంకు (265వ ర్యాంకు), కేతు కార్తికేయ నాలుగోర్యాంకు (291వ ర్యాంకు), బి.విఘ్నేష్‌కుమార్ ఐదో ర్యాంకు (393వ ర్యాంకు), కైవశం చేసుకున్నారు. ఎ.దుర్గాలక్ష్మీనీలేశ్వర్ ఆరో ర్యాంకు (453వ ర్యాంకు), ఎ. మహేష్ ఏడో ర్యాంకు (490వ ర్యాంకు), కె.దినేష్‌కుమార్ ఎనిమిదో ర్యాంకు (495ర్యాంకు), వి.సుజన్‌కుమార్ తొమ్మిదో ర్యాంకు (541వ ర్యాంకు), జి. మారుతి పదో ర్యాంకు (674వ) ర్యాంకు వచ్చింది. 1000లోపు ర్యాంకులు 50, రెండువేల లోపు 100కుపైగా ర్యాంకులు వచ్చినట్టు అంచనా వేస్తున్నారు.

జడ్పీలో హడావిడిగా బిల్లులు

... 1వ పేజీ తరువాయి

రూ.కోటికి ఆరు నెలల క్రితమే బిల్లులు అందాయి. అయితే పాడేరు బిల్లుల మంజూరులో అధికారులు తాత్సారం చేశారు. ఈలోగా అనకాపల్లి జిల్లా నుంచి రూ.2.3 కోట్లకు మార్చిలో బిల్లులు వచ్చినా అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆమోదించలేకపోయారు. అయితే ఈనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు తరువాత సుమారు రూ.3 కోట్ల బిల్లులు ఆమోదించాలని అధికారులు ప్రయత్నాలు మొద లెట్టారు. ఈ నేపథ్యంలో అకౌంట్స్ విభాగం సిబ్బంది మూడు రోజుల్లో బిల్లులు స్క్రూట్నీ చేసి గ్రాంట్స్ విభాగానికి పంపించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులుఆమోదించవచ్చునని కొందరు చెప్పినా అధికారులు పట్టించుకోకుండా ముందుకువెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. కాగా బిల్లులు ఆమోదంపై జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు వద్ద ప్రస్తావించగా పాడేరు డివిజన్‌లో నీటి పథకాల నిర్వహణకు ఖర్చు చేసిన రూ.కోటి విలువైన బిల్లులు ఆమోదించాలని సిబ్బందికి ఆదేశించానన్నారు. ఆరు నెలల క్రితమే బిల్లులు వచ్చినా నిధులు లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. అనకాపల్లి నుంచి వచ్చిన బిల్లులతోపాటు మరికొన్ని బిల్లులు మొత్తం రూ.3 కోట్లకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.